మాట్లాడుతున్న హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి నాగార్జునరెడ్డి



గడికోటను అభివృద్ధి చేయడమే లక్ష్యం

● హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి సీవీ నాగార్జునరెడ్డి

వీరబల్లి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): తన స్వగ్రామమైన వీరబల్లి మండలం గడికోటను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు హైకోర్టు మాజీ విశ్రాంత న్యాయమూర్తి సీవీ నాగార్జునరెడ్డి తెలిపారు. స్వగ్రామమైన యడబల్లిలో తండ్రి చింత శ్రీరాముల్‌రెడ్డి విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించారు. ఆయనతో పాటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు విశ్రాంత జడ్జి పి.లక్ష్మణరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తన తండ్రి శ్రీరాములురెడ్డి ఉన్న సమయంలో గడికోటను అన్ని విధాలా అభివృద్ధి చేశారన్నారు. ఏడుకొండలు వంతెన ఏర్పాటు చేయడం, కమ్యూనికేషన్ వసతి కల్పించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ అధ్యక్షుడు నల్లారి ద్వారకనాథరెడ్డి, వైసీపీ జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, మాజీ ఎంపీపీ విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సౌమ్యనాథస్వామిని దర్శించుకున్న పీఠాధిపతులు



సౌమ్యనాథస్వామి సన్నిధిలో పీఠాధిపతులు

నందలూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రసిద్ధిగాంచిన నందలూరు సౌమ్యనాథస్వామిని నేపాల్ పీఠాధిపతులు స్వామి రామకృష్ణాచారి, మాయువు, సీతాబాబా, తిరుపతి పీఠాధిపతులు సోమయాజుల స్వామి, బాలాజీస్వామి, వీరితో పాటు సినీ గాయకుడు గజల్ శ్రీనివాస్, నేపాల్ మాజీ డీజీపీ శైలేంద్రకుమార్ శ్రేష్ఠ శనివారం రాత్రి దర్శించుకున్నారు. వీరికి బీజేపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌నాయుడు, పోతురాజు మస్తానయ్య, నాగేశ్వరరావు, మాజీ ఆర్టీసీ రీజనల్ ఛైర్మన్ ఎద్దుల సుబ్బరాయుడు, సీనియర్ టీడీపీ నాయకులు గంటా వాసుదేవయ్య, పీఠాధిపతులకు స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతంతో దర్శనభాగ్యం కలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు హిమగిరినాథ్‌యాదవ్, టీడీపీ నాయకులు మోడపోతుల రాము, తాటి సుబ్బరాయుడు, జనసేన నాయకులు కొట్టే శ్రీహరి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు

● మంత్రి, కలెక్టర్, జేసీ

రాయచోటి (కలెక్టరేట్), జనవరి 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజలందరికీ భోగి, మకర సంక్రాంతి, కనుమ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి, కలెక్టర్ చామకూరి శ్రీధర్, జేసీ ఆదర్శ్ రాజేంద్రన్‌లు ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో శుభాకాంక్షలు తెలిపారు. భోగి మంటల వెచ్చటి వెలుగులు పరిపూర్ణమైన ఆరోగ్యాన్ని ప్రసాదించాలని, మకర సంక్రాంతి కాంతులతో ప్రతి ఇల్లు సంక్షేమ, సౌభాగ్యాలతో శోభాయమానంగా వెలుగొందాలని, కనుమ కాంతులతో పల్లె సీమలు, పశుసంపద, వ్యవసాయ ఉద్యాన పంటలతో సుభిక్షంగా కళకళలాడాలని ఆకాంక్షించారు. వీరితో పాటు జిల్లాలోని ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిదులు తదితరులు జిల్లా ప్రజలందరికీ భోగి, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

రాయలసీమ హక్కులపై దగా

● మాజీ మంత్రి డాక్టర్ సాకే శైలజానాథ్

కడప సెవెన్‌రోడ్స్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): రాయలసీమకు రావాల్సిన పరిశ్రమలు, సంస్థలు ప్రాజెక్టులు ఇవ్వకుండా, ఇక్కడి వారి హక్కులపై ప్రభుత్వాలు దగా చేస్తున్నాయని మాజీ మంత్రి, ఏపీసీసీ మాజీ అధ్యక్షుడు డాక్టర్ సాకే శైలజానాథ్ అన్నారు. రాయలసీమ అభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో కడప ఐఎంఏ హాల్లో కన్వీనర్ డాక్టర్ సి.ఓబుల్‌రెడ్డి అధ్యక్షతన ఆదివారం జరిగిన సీమ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మంచి బిజినెస్, సాంకేతిక సేవలు, లాభాలు, శాఖలు, ఇలా అనేక అంశాల్లో ఏపీజీబీ దేశంలోనే అగ్రగామి బ్యాంకుగా ఉన్నా విలీనం తర్వాత దాని ప్రధాన కార్యాలయాన్ని కడప నుంచి అమరావతికి తరలించాలనుకోవడం రాజకీయ దుర్మార్గమని, దీనిపై మాజీ, ప్రస్తుత ప్రజాప్రతినిధులు అంతా ఎవరి స్థాయిలో వారు ప్రతిఘటించాలని, లేకపోతే చరిత్రలో దోషులుగా మిగిలిపోతామన్నారు. ఏపీ ఎస్సీ, ఎస్టీ లాయర్స్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ రాష్ట్ర కన్వీనర్ వై.జయరాజు మాట్లాడుతూ హైకోర్టు బదులు కర్నూలులో బెంచ్ పెడతామంటూ అదేదో ఉద్ధరిస్తున్నట్లు మాట్లాడుతున్నారని, ఇది రాయలసీమ హక్కుల నిరాకరనేనని అన్నారు. రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం, నేటి ప్రభుత్వాలు రాయలసీమ పట్ల బాధ్యతగా వ్యవహరించలేదన్నారు.

పల్లెకు పోదాం.. పండుగ చేద్దాం..

● పట్టణాల నుంచి పల్లెబాట పట్టిన ప్రజలు ● మొదలైన సంక్రాంతి సందడి



పీలేరులోని పూలు, రంగుల దుకాణాల వద్ద సందడి



గాలిపటాలు కొనుగోలు చేస్తున్న దృశ్యం

పీలేరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): హిందూ సంప్రదాయంలో పెద్దపండుగగా పిలుచుకునే సంక్రాంతి పండుగ సందడి జిల్లావ్యాప్తంగా మొదలైంది. విద్య, ఉపాధి, ఉద్యోగ, వ్యాపార అవసరాల కోసం బయట ప్రాంతాల్లో స్థిరపడిన చాలా మంది ఆదివారం ఉదయం నుంచి పల్లెబాట పట్టారు. ఆర్టీసీ బస్సులు మొదలుకుని స్వంత కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు...ఇలా తమకు అందుబాటులో ఉన్న వాహనాల్లో బయలుదేరి సొంతూళ్లకు చేరుకుంటున్నారు. పల్లెలకు వెళ్లే ముందు పండుగకు కావాల్సిన సామగ్రిని కొనుగోలు చేసుకుని వెళుతున్నారు. పీలేరులో ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పట్టణంలో రద్దీ నెలకొంది. పిల్లాపాపలు, తల్లిదండ్రులు, పూర్వీకులకు పెట్టేందుకు కొత్త బట్టల కొనుగోలుకు ప్రజలు పెద్దఎత్తున తరలిరావడంతో పట్టణంలోని వస్త్రదుకాణాలు నిండుగా కనిపించాయి. పూజాసామాగ్రి, పశువుల అలంకరణ, పూల దుకాణాల్లో వ్యాపారం జోరుగా సాగింది. అయితే సోమవారం వ్యాపారం మరింత పుంజుకుంటుందని స్థానిక వ్యాపారులు ఆశాభావం వ్యక్తం చేశారు.



మదనపల్లె బస్టాండులో బస్సుల కోసం ప్రయాణికుల ఎదురుచూపు





అమ్మకానికి సిద్ధంగా ఉన్న పశువుల అలంకరణ సామగ్రి

మట్టి మాఫియాపై తహసీల్దార్ కొరడా

● నాలుగు ట్రాక్టర్ల సీజ్.. పోలీసులకు అప్పగింత



సీజ్ చేసిన మట్టి ట్రాక్టర్లతో తహసీల్దార్ ఖాజాబీ, ఆర్ఐ శేషాద్రిరావు

మదనపల్లె, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం చిప్పిలి సమ్మర్ స్టోరేజీ ట్యాంకు ఏరియాలో ఇసుక, మట్టి తవ్వుతున్న అక్రమార్కులపై రెవెన్యూ అధికారులు కొరడా ఝుళిపించారు. మదనపల్లెలో మండలం వేంపల్లె వాటర్ వర్క్స్ కేంద్రం, చిప్పిలి సమ్మర్ స్టోరేజీ ట్యాంకు (ఎస్ఎస్) ఇసుక అక్రమ రవాణాపై 'మదనపల్లెలో ఇసుకాసురులు' అనే శీర్షికన ఆదివారం కథనం వెలువడింది. దీనికి తహసీల్దార్ ఎస్.ఖాజాబీ, ఆర్ఐ శేషాద్రిరావు స్పందించారు. ఇందులో భాగంగా ఆదివారం వేంపల్లె వాటర్ వర్క్స్, చిప్పిలి ఎస్ఎస్ ట్యాంకు ఏరియాలను పరిశీలించారు. అక్రమంగా మట్టి తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను సీజ్ చేశారు. అనంతరం వాటిని తాలూకా పోలీసులకు అప్పగించారు. అనుమతి లేకుండా ఎవరైనా ఇసుక, మట్టిని తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ముఖ్యంగా వేంపల్లె వాటర్ వర్క్స్ కింది భాగంలోని బాహుదా నదిలో ఇసుక తవ్వకాలపై సీరియస్ అయ్యారు. మున్సిపల్ ఊట బావుల్లో భూగర్భజలాలు వృద్ధి చేయడానికి చెక్‌డ్యాంలు నిర్మించి అక్కడ కొన్నేళ్లుగా ఇసుక తవ్వకాలను నిషేధించినట్లు తహసీల్దార్ తెలిపారు. నదికి అటు, ఇటు తమ భూములు ఉన్నాయనే పేరుతో ఎవరైనా మరోసారి ఇసుక తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఇసుక వ్యాపారులను హెచ్చరించారు. ఇదిలావుండగా, ఆంధ్రజ్యోతిలో ఆదివారం ఇసుక అక్రమ రవాణాపై కథనం రావడంతో నిత్యం ఈ ప్రాంతంలో ఇసుక తవ్వే వారు అక్కడి నుంచి పరారయ్యారు. తహసీల్దార్‌తో పాటు వేంపల్లె, అంకిశెట్టిపల్లె వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

పిచ్చి ప్రేలాపనలు మానుకోవాలి

● అధికారం ఉంటే ఒకలా.. లేకుంటే మరోలా ఉండకూడదు ● ఎంపీ మిథున్‌రెడ్డి వ్యాఖ్యలపై మంత్రి మండిపల్లి



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వానికి ప్రజల్లో వస్తున్న స్పందన చూసి ఓర్వలేని ఎంపీ మిథున్‌రెడ్డి అధికార పార్టీపై పిచ్చి ప్రేలాపనులు చేయడం మానుకోవాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఘాటుగా స్పందించారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అధికారం ఉన్నప్పుడు మందీ మార్బలంతో నియోజకవర్గాల్లో తిరిగేది కాదని, అధికారం ఉన్నా లేకపోయినా మనిషి ఒకేలా ఉండాలన్నారు. అధికారం కోల్పోయిన తర్వాత రాయచోటికి వచ్చి పార్టీ అధికారంలో లేదని చెప్పి అధికార పార్టీపై అసత్య ఆరోపణలు చేస్తే ప్రజలు చూస్తూ ఊరుకోరన్నారు. అధికారంలో ఉన్నప్పుడు వైసీపీ నేతలు చేసిన తప్పులకు రాష్ట్ర ప్రజలు తగిన గుణపాఠం చెప్పి 11 సీట్లు ఇచ్చారన్నారు. విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబు రాష్ట్ర అభివృద్ధిని, సంక్షేమాన్ని రెండు కళ్లలాగా చేసుకుని పరుగులు తీస్తున్నారని చెప్పారు. వైసీపీ నేతలు అధికార పార్టీపై అనవసర ఆరోపణలు చేయడం మానుకుని నీతి, నిజాయితీగా ప్రతిపక్ష పాత్ర పోషించాలని ఆయన హితవు పలికారు. ప్రజా క్షేత్రంలో పాలక పక్షం ఏదైనా తప్పు చేస్తే వేలెత్తి చూపించే బాధ్యత వైసీపీ వాళ్లకు ఉంటుందన్నారు. అయితే మిథున్ రెడ్డి రాయచోటి అభివృద్ధి గురించి మాట్లాడడం విచిత్రంగా ఉందన్నారు. వైసీపీ నేతల పాపానికి అన్నమయ్య ప్రాజెక్టు నిదర్శనం అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో రోడ్లను గాలికి వదిలేస్తే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అన్ని రకాల వ్యవస్థలను గాడిలో పెడుతూ రోడ్ల మరమ్మతులకు, గ్రామీణ ప్రాంతాల్లో సిమెంటు రోడ్లు, తాగునీటి సమస్య పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. ఇప్పటికైనా మిథున్‌రెడ్డి హుందాగా వ్యవహరిస్తూ రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని ఆయన సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

● మరొకరికి తీవ్ర గాయాలు.. చెన్నైకి తరలింపు

● మృతుల్లో ఒకరు తిరుపతి టౌన్ బ్యాంక్ మేనేజర్... మరొకరు కడప వాసి...

వివరాలు... 7లో

కబ్జా కోరల్లో చెరువులు

● చెరువును పూడ్చేసి ఇళ్ల నిర్మాణాలు

● తగ్గిపోతున్న ఆయకట్టు

● వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం చెరువులకు శాపం

● చెరువుల ఆక్రమణపై చర్యలు తీసుకోవాలని రైతుల డిమాండ్



గాలివీడు పెద్దచెరువును ఆక్రమించి నిర్మించిన ఇళ్లు



ఆక్రమణకు గురైన పెద్దచెరువు

గాలివీడు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం పుణ్యమా అని చెరువులన్నీ కబ్జాకు గురయ్యాయి. చెరువు కింద ఆయకట్టు మాట దేవుడెరుగు కొన్ని చెరువుల్లోకి నీరు వచ్చే మార్గం కూడా లేకుండాచేశారు. చెరువులను సగానికి పైగా కబ్జా చేసి దర్జాగా ఇళ్లు కూడా నిర్మించుకున్నారు. ఇదంతా వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగినా అప్పట్లో అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకునే నాథుడే లేకపోవడంతో రైతులు ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉండిపోయారు. మండలంలోని చెరువులన్నీ దాదాపు కబ్జాదారుల కోరల్లో చిక్కుకున్నాయి. చెరువులు ఆక్రమణకు గురి కావడంతో నీటి లభ్యతతో పాటు ఆయకట్టు విస్తీర్ణంలో పంటల దిగుబడి తగ్గిపోతోంది. ఈ ఆక్రమణ ఇలాగే కొనసాగితే చెరువులను పుస్తకాల్లో చదువుకోవాల్సిందే. గాలివీడు మండలంలో 17పంచాయతీలు ఉన్నాయి. ఒక వెలిగల్లు పంచాయతీలో తప్ప మిగిలిన పంచాయతీల్లో 224 చిన్న, పెద్దచెరువులు ఉన్నాయి. వెలిగల్లు ప్రాజెక్టుతో పాటు వంద ఎకరాలకు పైన ఆయకట్టు కలిగిన 3 చెరువులు ఉన్నాయి. అందులో అరవీడు పంచాయతీలోని కుషావతి ప్రాజెక్టు కింద 697 ఎకరాలు, గోరాన్‌చెరువు పంచాయతీలోని గాలివీడు పెద్దచెరువు కింద 143 ఎకరాలు, తలముడిపి పంచాయతీలోని పెద్దచెరువు కింద 182 ఎకరాలు ఆయకట్టు భూములు కలవు. ఇవికాక మిగిలిన 221 చెరువుల కింద 5 వేల ఎకరాలకుపైగా సాగు భూమి ఉంది.

కబ్జాకు గురవుతున్న చెరువులు

మండలంలోని 80 శాతం చెరువులు, కుంటలు ఆక్రమణకు గురవుతున్నాయి. గాలివీడు, గోరాన్‌చెరువు పంచాయతీలోని గాలివీడు పెద్దచెరువు చాలా వరకు ఆక్రమణకు గురైంది. ఈ చెరువు గాలివీడు-రాయచోటి ప్రధాన రహదారికి సమీపంలో ఉండడం వల్ల ఇక్కడ స్థలాలకు ఎక్కువ గిరాకీ ఉండడం వల్ల ఆక్రమణలు జరిగాయి. చెరువు ఆనుకుని ఉత్తరం వైపున కొన్ని సంవత్సరాలుగా ఇటుక బట్టీలు వేసేవారు. వారితో పాటు మరికొందరు చెరువు భూమిని ఆక్రమించి ప్లాట్లు వేసి అమ్మడంతో అక్కడ చాలా మంది ఇళ్లను నిర్మించుకున్నారు. ఈ ఒక్క చెరువే రెండు ఎకరాలకు పైన ఆక్రమణకు గురైనట్లు స్థానికులు చెబుతున్నారు. తూముకుంట పంచాయతీలోని నేరేడిచెరువు, గంగిరెడ్డి చెరువు, చిన్నవంకచెరువు ఆక్రమణలకు గురి కాగా నేరేడిచెరువు జిల్లా సరిహద్దులో ఉండడం వల్ల సత్యసాయి జిల్లా మరికావుడ గ్రామ, వెంకిలవాండ్లపల్లెకు చెందిన రైతులు చెరువును పూడ్చి వ్యవసాయ భూములను తయారు చేసుకొన్నట్లు గ్రామ రైతులు తెలిపారు. నూలివీడు, పూలుకుంట, సీసీ పల్లెతో పాటు మిగిలిన పంచాయతీల్లోని చెరువులు, కుంటలను ఆక్రమించుకుని పంటలతో పాటు కొంతమంది రైతులు మామిడిచెట్లను నాటుకున్నట్లు సమాచారం. ఇప్పటికే చాలా మంది ఆయకట్టు రైతులు చెరువులు ఆక్రమణపై గత ప్రభుత్వంలో ఫిర్యాదు చేసినప్పటికీ అప్పటి అధికారులు పట్టించుకోలేదని రైతులు చెబుతున్నారు.

వైసీపీ నిర్లక్ష్యం.. రైతులకు శాపం

వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కొందరు నాయకులు ప్రభుత్వ భూములతో పాటు చెరువులను కూడా ఆక్రమించుకున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. వివిధ గ్రామాలకు చెందిన రైతులు, చెరువులు ఆక్రమణపై అనేక పర్యాయాలు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోలేదని వారు తెలిపారు. చెరువులను అభివృద్ధి చేయకపోగా ఉన్న చెరువులను ఆక్రమించుకుని భూములను తయారు చేసుకున్నారు. 10 సంవత్సరాల క్రితం ఒకసారి చెరువులు నిండితే రెండుసార్లు పంటలు సాగయ్యేవని తద్వారా పంటల దిగుబడి కూడా ఎక్కువగా ఉండేదని పలువురు రైతులు పేర్కొన్నారు. కానీ నేడు చెరువులు కబ్జాకు గురి కావడం వల్ల చెరువులు అన్నీ కుంటలు గానూ కుంటలు చెక్‌డ్యాంలుగా మారిపోయాయి. ప్రస్తుతం చెరువులు పూర్తి స్థాయిలో నిండినప్పటికీ ఒక కారు పంట మాత్రమే సాగు చేసుకునే అవకాశం ఉందని, రెండో పంటకు నీళ్లు ఉండవని రైతులు వాపోతున్నారు. మండలంలో చెరువుల కింద రెండు సీజన్లలో గతంలో పంటలను సాగు చేసేవారు. ఖరీఫ్ సీజన్‌లో అంటే జూన్, జూలైలో చెరువులు నిండితే ఖరీఫ్ పంటలతో పాటు రబీ పంటలను కూడా సాగు చేసేవారు. గతంలో చెరువుల కింద వరిని దాదాపు 10 వేల ఎకరాల వరకు సాగు చేసేవారు. కానీ నేడు చెరువులు ఆక్రమణకు గురి కావడం వల్ల 5 వేల నుంచి 7 వేల ఎకరాల వరకు మాత్రమే వరి సాగు చేస్తున్నారు. చెరువులు కబ్జాకు గురి కావడం వల్ల చెరువులు పరిమాణం తగ్గిపోయి తద్వారా భూగర్భజలాలు తగ్గడంతో పాటు వాటి కింద సాగు విస్తీర్ణం కూడా తగ్గిపోతోందని రైతులు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా మండలంలోని చెరువులను సర్వే చేయించి ఆక్రమణదారుల నుంచి వేరు చేసి రక్షణ కల్పించాలని పలువురు రైతులు డిమాండ్ చేస్తున్నారు.

అధికారులు చర్యలు తీసుకోవాలి..



మండలంలో గత కొన్ని సంవత్సరాలుగా కొన్ని చెరువులు కబ్జాకు గురయ్యాయి. గాలివీడు పెద్దచెరువు, తూముకుంటలోని నేరేడి చెరువుతో పాటు మరికొన్ని చెరువులు ఆక్రమణకు గురయ్యాయి. తద్వారా నీటి సాంద్రతతో పాటు పంటల విస్తీర్ణం తగ్గిపోతోంది. అధికారులు స్పందించి చెరువును సర్వే చేసి ఆక్రమణలదారుల నుంచి కాపాడాలి.

- కాల్వపల్లె రాంమోహన్‌నాయుడు, తూముకుంట

చెరువుల ఆక్రమణపై కఠిన చర్యలు

ఎవరైనా చెరువులు, వాగులు, వంకలను ఆక్రమిస్తే అలాంటి వారిపై కటిన చర్యలు తీసుకొంటాము. ఎప్పటికప్పుడు చెరువుల ఆక్రమణపై నిఘా ఉంచాము.

- భాగ్యలత, తహసీల్దార్

సంక్రాంతి వేడుకలేవీ...?

కనుమరుగవుతున్న గంగిరెద్దు ● జాడలేని గంగిరెద్దుల నృత్యాలు ● గొబ్బి ఆటలు ఆడేవారెవరు ? ● వినిపించని హరిదాసుల గొంతు





ఇంటి ముందు అలంకరించిన గొబ్బెమ్మ



గంగిరెద్దు ఆటలు (ఫైల్ ఫొటో)



బొమ్మల కొలువు

బద్వేలు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): నాడు సంక్రాంతి పండుగ వచ్చిందంటే గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొనేది. ఘనంగా వేడుకలను నిర్వహించుకునే వారు. కోడిపందేలు, ఎడ్ల పందాలు, రంగు రంగు ముగ్గుల్లో.. గొబ్బెమ్మలు, హరి దాసులు, గంగి రెద్దులు, కొత్త అల్లుళ్లతో సంక్రాంతి పండుగ కళకళలాడేది. పల్లెల్లో గాలి పటాల ఎగురవేత, ఇళ్లల్లో బాలికలు ఏర్పాటు చేసే బొమ్మల కొలువు, ఇంటి ముందు గంగి రెద్దుల నృత్యాలు ఇలా సంక్రాంతి పండుగ వేడుకగా జరిగేది. ఇదంతా ఒకప్పటి సంగతి. ఇప్పుడు సంక్రాంతి పండుగ మారిపోయింది. పండుగ రోజు తెల్లవారు జామున లేచి, తలంటి స్నానాలు చేసి, నూతన దుస్తులు ధరించి, మహిళలు పోటాపోటీగా రంగు రంగుల ముగ్గులువేసి ఇంటి పరిసరాలను ముచ్చటగా తయారు చేసుకునేవారు. నేడు అలాంటి దృశ్యాలు కనుమరుగవుతున్నాయి. పట్టణ వాసులు సైతం సంక్రాంతి పండుగ అనగానే పది రోజుల ముందే పల్లెకు చేరుకుని, అంతా కలసి పండుగ సంబరాల్లో మునిగే వారు. తెల్లవారు జామునే బాలసంతలు, పకీరుల వేషాలు వంటి దృశ్యాలు ఏనాడో కనుమరుగయ్యాయి. ఇంటి ముందుకు వచ్చి వంగి వంగి దండాలు పెట్టే గంగిరెద్దు నృత్యాల జాడలేకుండా పోయాయి. ఉదయాన్నే తలపాగా చుట్టుకుని ఇంటిముందు హరిదాసులు పాడే గీతాలు మచ్చుకైనా విన్పించడం లేదు. సంక్రాంతి పండుగ వచ్చిందంటే గ్రామాల్లో నెలరోజుల నుంచే సందడి వాతావరణం నెలకొనేది. ఇప్పటి పరిస్థితుల్లో పాఠశాలలు, కళాశాలలు, బీటెక్ కళాశాలలు నామమాత్రంగానే సంక్రాంతి వేడుక చేస్తున్నారు. ప్రజలకు ఇప్పుడు సంక్రాంతి పండుగ భారంగా మారింది. నిత్యావసర సరుకుల ధరలు పెరిగిపోవడంతో ఏమీ కొనలేని పరిస్థితి ఏర్పడింది. పల్లెల్లో కరువు ఉండడంతో సంక్రాంతి పండుగను నామ మాత్రంగా చేసుకునే పరిస్థితి ఏర్పడింది.

రెడీమేడ్ వస్తువులపై ఆసక్తి

నాడు సంక్రాంతి పండుగ వస్తుందంటే 20రోజుల ముందే పల్లెల్లో ఇండ్లల్లో వి విధ రకాలు పిండివంటలు చేసేవారు. కర్జికాయలు, కారాలు, లడ్లు, అత్తరాసలు వంటివి స్వయంగా మహిళలు చేసుకునేవారు. అయితే రెడీమెడ్‌గా దొరుకుతుండడంతో పాత కాలపు వంటలకు స్వస్తిపలికి, రెడీమెడ్‌లో లభించే వస్తువులను కొనుగోలు చేసేందుకు ఆసక్తి కనపరుస్తుండడంతో నాటి వంటకాలు, వాటి రుచులకు దూరమవుతున్నారు.

జాడలేని గంగిరెద్దుల నృత్యాలు

సంక్రాంతి పండుగ వచ్చిందంటే పశువులను ఎంతో అందంగా అలంకరించే సంప్రదాయం. గంగిరెద్దులను ఎంతో అందంగా అలంకరించి, ఇండ్ల ఎదుట మేళం వాయిస్తే వాటికి అనుగుణంగా గంగిరెద్దులు నృత్యం చేసేవి. ఈ నృత్యం ఎంతో ఆనందకరంగా ఉండేది. అయ్యగారికి దండంపెట్టు అని చెప్పగానే గంగిరెద్దు కిందికి వంగి దండంపెట్టడం వంటివి సంక్రాంతికి ఎంతో సందడిచేసేవి. ఆ గంగిరెద్దు యజమానికి పాత వస్త్రాలు, ధాన్యము ఇచ్చేవారు. కాలానుగుణంగా ఈ గంగిరెద్దుల నృత్యాలు జాడలేకుండా పోతున్నాయి.

విన్పించని హరిదాసుల రాగం

సంక్రాంతి పండుగ రోజు గ్రామాల్లో హరిదాసుల హడావిడి ఉండేది. తలకు పాగా కట్టుకుని తంబురా చేతపట్టుకుని ఇంటి వద్దకు వచ్చి 'హరిలో రంగ హరి' అంటూ ఎంతో ముచ్చటగా రాగాలు తీసేవారు. నేడు హరిదాసుల రాగాలే విన్పించడంలేదు. రంగు రంగుల ముగ్గులువేసి, ముగ్గుల్లో గొబ్బెమ్మలను పెట్టి, బాలికలు గుమికూడి చక్కగా పాటలు పాడి ఆడుతూ సందడి చేసేవారు. నేడు గొబ్బెమ్మలు, అలనాటి పాటలు, ఆటలు కొన్నిచోట్లే సాగుతున్నాయి.

నాటి ధాన్యపు రాశులు

తాతయ్యా ధాన్యపు రాసులు చూపించ వా.... నానమ్మా లేగదూడలు ఎక్కడ.... అమ్మమ్మా హరిదాసులేరి, గంగిరెద్దులేవీ. సంక్రాంతి పండుగకు వివిధ ప్రాంతాల నుంచి స్వగ్రామాలకు చేరుకున్న వారి పిల్లలు వేస్తున్న ప్రశ్నలు ఇవి. అయితే తాతయ్య, నానమ్మల గొంతు పెగలడం లేదు. వ్యవసాయంతో ముడిపడి సాగే సంక్రాంతిని ఈ సారి కరువు కమ్మేసింది. పల్లెల్లో పచ్చని పొలాలు బీళ్లుగా మారడంతో రైతన్నల ముంగిట ధాన్యపు రాశులు పెద్దగా కానరావడం లేదు. 40శాతం కూడా దాటని విస్తీర్ణంలో పెట్టిన పంటలు ఎలా కాపాడుకోవాలో అని రైతన్నలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది కన్నా, ఈ సారి వ్యాపారాలు తగ్గాయని, వ్యాపార వర్గాలు గగ్గోలు పెడుతున్నాయి.

సంక్రాంతి సంబరాలు చూసొద్దాం రండి

కామనూరులో అంగరంగ వైభవంగా సంక్రాంతి వేడుకలు ● ఆకట్టుకునేలా ఆటల పోటీలు ● ఆకర్షణీయమైన బహుమతులు

ప్రొద్దుటూరు రూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): పల్లె సీమకు వెలుగు నింపే పండుగ వచ్చింది. గ్రామాలు సుఖశాంతులతో, ధన ధాన్యాలతో శోభిల్లాలని వైభవంగా సంక్రాంతి ఉత్సవాలు జరిపేందుకు ఏర్పాట్ల కోలాహలం మొదలైంది. జిల్లాలోనే ఎక్కడా లేని విధంగా నాలుగు రోజులు సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటేలా కామనూరు గ్రామంలో నిర్వహించనున్నారు. ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి స్వగ్రామం కామనూరులో ఆయన సోదరుడు మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి, గ్రామ పెద్దలు, కామనూరు ప్రజల ఆధ్వర్యంలో సంబరాలను నిర్వహిస్తున్నారు. రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు, పార్వేట మహోత్సవం, లక్ష్మీప్రసన్న వేణుగోపాలస్వామి, భీమలింగేశ్వరస్వామి గ్రామోత్సవాలను తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది ప్రజలు తరలి రానున్నారు. సంక్రాంతి సంబరాలకు తలమానికంగా నిలిచిన కామనూరు ఉత్సవాలు వైభవంగా జరిగేందుకు దేవాలయాలు, వాటి పరిసర ప్రాంతాలు, వివిధ రకాలపోటీలు నిర్వహించే మైదానంలో విద్యుత్తు లైట్లతో అలంకరించారు. పెద్ద పెద్ద స్తంభాలకు అధిక విద్యుత్తు కాంతులను వెదజల్లే లైట్లను అమర్చి ఏర్పాట్లను తీర్చిదిద్దుతున్నారు. పోటీలకు అనుగుణంగా మైదానాన్ని చదును చేయడం, సభా వేదిక, చలువ పందిర్ల ఏర్పాట్లు, తదితర పనులను ముమ్మరంగా చేపట్టారు.

భోగి సందర్భంగా

సోమవారం ఉదయం 15 ఏళ్లలోపు జూనియర్ కబడ్డీ పోటీలను (టీమ్‌కు ఏడుగురు సభ్యులు) నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో మొదటి మూడు బహుమతులు ఇస్తారు. ఉదయం 10 గంటలకు ట్రాక్టర్ అండ్ ట్రాలీ రివర్స్ పందెం నిర్వహించనున్నారు. రెండు బహుమతులు ఇస్తారు. మధ్యాహ్నం రెండు గంటలకు స్లోబైక్ రైడ్ పోటీని నిర్వహిస్తారు. ఇందులో రెండు బహుమతులు ఇవ్వనున్నారు. రాత్రి 7 గంటలకు అరుణ ఆర్కెస్ట్రా వారిచే రేలా రే రేలా సంగీత విభావరి ఏర్పాటు చేశారు. సంక్రాంతి రోజున ఉదయం 8 గంటలకు 15 ఏళ్లు పైబడిన సీనియర్ కబడ్డీ పోటీలు (టీంకు ఏడుగురు సభ్యులు) పోటీలు జరుగనున్నాయి. పోటీల్లో రెండు బహుమతులు ప్రకటించారు. మధ్యాహ్నం భోజన ఏర్పాట్లను చేయనున్నారు. కనుమ రోజు ఉదయం 5 గంటలకు ప్రసన్న వేణుగోపాలస్వామి, భీమలింగేశ్వరస్వామి దేవాలయాల్లో వివిధ రకాల పూజా కార్యక్రమాలు చేపట్టనున్నారు. సాయంత్రం ఆరు గంటలకు పార్వేట మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. పార్వేట కామనూరు నుంచి ప్రారంభమై రాధానగర్, గోపులాపురం, ఎర్రబల్లె, పెద్ద అగ్రహారం, బుక్కాయపల్లె, చిన్న అగ్రహారం, మాచనపల్లె మీదుగా 16వ తేదీ ఉదయం 6 గంటలకు గ్రామంలోని ప్రసన్న వేణుగోపాలస్వామి దేవస్థానం చేరుతుందన్నారు. అదే రోజు ఉదయం 6 గంటలకు రాయచోటికి చెందిన రవితేజ చెక్కభజన బృందంచే చెక్కభజన చేపట్టనున్నారు.



మైదానంలో ఏర్పాటు చేసిన సభావేదిక

సుఖశాంతులతో శోభిల్లాలనీ....

ఇక్కడి స్వామివారి మూలవిరాట్టు నిర్మాణం చాలా విశేషమైంది. దశావతారాలు, గోపికలతో, పొన్నచెట్టు, గోవులతో, చతుర్భుజుడు శంఖచక్రాలతో, వేణువుతో శ్రీకృష్ణ పరమాత్మ అత్యద్భుతంగా భక్తులకు దర్శనమిస్తూ ఉన్నారు. కామనూరులో నిర్వహించే గ్రామోత్సవం, పార్వేట మహోత్సవాలను తిలకించేందుకు వేలాదిగా భక్తులు, ప్రజలు, కళాకారులు రానున్నారు.

యుద్ధానికి సై...

16వ తేదీ ఉదయం 9 గంటలలకు సీనియర్ కేటగిరి విభాగంలో బండలాగుడు పందేలు నిర్వహించనున్నారు. ఇందులో మొదటి బహుమతిగా రాయల్‌ఇన్‌ఫిల్డ్ 350 సీసీ (బుల్లెట్) మొదటి బహుమతి, రెండో బహుమతిగా టీవీఎస్ అపాచి 160 సీసీ, మూడో బహుతి టీవీఎస్ ఫోర్ట్ ద్విచక్ర వాహనం, 4వ బహుమతి టీవీఎస్ ఎక్స్‌ఎల్ 100, 5వ బహుమతిగా రూ.25 వేలు నగదు, 6వ బహుమతిగా రూ.15 వేలు విజేతలకు అందజేయనున్నట్లు తెలిపారు. మిగిలిన వారికి కన్సొలేషన్ బహుమతిగా రూ.5,116 అందించనున్నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయిలో నిర్వహించే ఈ ఎడ్ల పోటీలకు ఇప్పటికే సుమారు 18 నుంచి 20 జతల ఎద్దుల జతలు పోటీల్లో పాల్గొననున్నాయని తెలిపారు. ఎండ్ల పందేలకు పాల్గొనదలచినవారు పి.శివకాంత్‌రెడ్డి 6302087016, నంద్యాల శివనాగిరెడ్డి 6305785859, పెద్ది చంద్రశేఖర్ రెడ్డి 8309294918, నంద్యాల వరప్రసాద్‌రెడ్డి 9989357009ను సంప్రదించాలని, నేరుగానైనా వచ్చి పేర్లు నమోదు చేసుకుని పోటీల్లో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

ఇద్దరు న్యాయాధికారులకు పదోన్నతి

కలికిరి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలో పనిచేస్తున్న ఇద్దరు న్యాయాధికారులకు పదోన్నతి లభించింది. కడప న్యాయాధికారి, సీనియర్ డివిజన్ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి ఎస్. ప్రవీణ్‌కుమార్, ప్రొద్దుటూరు న్యాయాధికారి, సీనియర్ డివిజన్ సివిల్ జడ్జి కె. సత్యకుమార్‌కు సీనియర్ డివిజన్ జిల్లా జడ్జిలుగా పదోన్నతి కల్పించారు. ఏపీ హైకోర్టు, రిజిస్ట్రారు (విజిలెన్స్) చేసిన సిఫారసులను ప్రభుత్వం ఆమోదిస్తూ ఆదేశాలు జారీ చేసింది. జిల్లా జడ్జి పోస్టుల క్యాడర్ స్ట్రెంగ్త్‌ను 157 నుంచి 173 పెంచారు. 65 శాతం కోటా కింద రాష్ట్రంలో 9 మందికి పదోన్నతులు లభించగా అందులో కడప జిల్లా నుంచి ఇద్దరు న్యాయాధికారులు స్థానం పొందారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు.

గల్లంతైన విద్యార్థి మృతి



విలపిస్తున్న తల్లిదండ్రులు ఇన్‌సెట్‌లో బాలుడు (ఫైల్ ఫొటో)

రాజుపాలెం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): గల్లైంతైన విద్యార్థి పందిటి యశ్వంత్ (7) మృతదేహం ఆదివారం లభ్యమైంది. పోలీసుల వివరాల మేరకు రాజుపాలెం మండలం పగిడాల వాసి యశ్వంత్ శనివారం బహిర్భూమికి వెళ్లాడు. విద్యార్థి చాపాడు కెనాల్‌లో తాపల వద్ద ప్రమాదానికి గురై నీటిలో మునిగినట్లు తెలిపారు. కాల్వలో గల్లంతవడంతో బాలుని ఆచూకీ కోసం చాపాడు కెనాల్‌ను జల్లెడ పట్టగా ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంటకు ఊరి శివారులో కంప చెట్లకు తగులుకుని ఉన్నాడని ఎస్‌ఐ కత్తి వెంకటరమణ తెలిపారు. బాలుడి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తున్నట్లు తెలిపారు. కుమారుడు చనిపోవడంతో తల్లిదండ్రులు భోరున విలపించారు.

అవయవదానంతో అమరుడై...

కన్నుమూసినా జీవిస్తున్న గోపిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి

గుండె, కాలేయం, కిడ్నీలను దానం చేసిన కుటుంబీకులు



ప్రొద్దుటూరు రూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కన్ను మూసినా గుండె, కాలేయం, కిడ్నీలను దానం చేసి గోపిరెడ్డి రాజశేఖర్ రెడ్డి అమరుడయ్యాడు. కుటుంబసభ్యులు తీసుకున్న నిర్ణయం మరికొందరికి ప్రాణాలను నిలపింది. సమీప బంధువులు అందించిన వివరాల్లోకెళితే....

ప్రొద్దుటూరు మండలం గోపవరం వాసి గోపిరెడ్డి రాజశేఖర్ రెడ్డికి రాజుపాళెం మండలం గోపాయపల్లెకు చెందిన శ్రీదేవితో వివాహమైంది. వీరు సుమారు 20 ఏళ్ల కిందట హైదరాబాదులో సెటిల్ అయ్యారు. కుమారుడు పవన్‌కుమార్‌రెడ్డి సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా హైదరాబాదులో పనిచేస్తున్నారు. కుమార్తె ప్రసన్న అమెరికాలో ఉద్యోగం చేస్తోంది. వీరికి ఇంకా వివాహాలు కాలేదు. గోపిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి ఈనెల 1వ తేదీన రోడ్డు ప్రమాదానికి గురై తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో అపస్మారకస్థితిలోకి వెళ్లారు. శనివారం గోపిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. కుటుంబ సభ్యుల ఏకాభిప్రాయం మేరకు ఆయన అవయవాలను దానం చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఆస్పత్రిలో ఆయన గుండె, కాలేయం, రెండు కిడ్నీలను వేరు చేసి ఇతరులకు ప్రాణదానం చేశారు. ఆదివారం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించగా హైదరాబాదులోని సనత్‌నగర్‌లో ఉన్న జెడ్ కాలనీలో ఇంటికి తరలించారు. ఆదివారం మధ్యాహ్నం రాజశేఖర్‌రెడ్డి మృతదేహానికి అంత్యక్రియలను నిర్వహించినట్లు బంధువులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

ఒకరికి తీవ్రగాయాలు





మదనపల్లె అర్బన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొనడంతో ప్రకాశ్ (55), మారుతీ శివకుమార్ (61) మృతి చెందగా ఆనంద్ గాయపడ్డాడు. కర్ణాటక రాష్ట్రం రాయల్పాడు వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై పోలీసులు తెలిపిన వివరాల మేరకు... తిరుపతి కట్టకిందపాలెంకు చెందిన ప్రకాశ్ తిరుపతి టౌన్ బ్యాంక్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. తన స్నేహితుడు ఆనంద్‌తో కలిసి శనివారం బెంగళూరు వెళ్లారు. పని ముగించుకుని తిరిగి వస్తుండగా కర్ణాటక రాష్ట్రం రాయల్పాడు వద్ద కడప నుంచి మారుతీ శివకుమార్ వెళుతున్న కారును ఆదివారం రాత్రి 9 గంటలకు ఢీకొంది. ప్రకాశ్ సంఘటనా స్థలంలోనే మృతి చెందగా తీవ్రంగా గాయపడ్డ ఆనంద్‌ను చెన్నైకి తరలించారు. కడప వాసి మారుతీ శివకుమార్‌ను మదనపల్లె ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

నెల్లూరు, చిత్తూరు జట్ల విజయం

కడప స్పోర్ట్స్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ సౌత్‌జోన్ అండర్ 12 బాలుర ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ మ్యాచ్‌లో భాగంగా ఆదివారం జరిగిన రెండు వేర్వేరు మ్యాచ్‌లలో చిత్తూరు, నెల్లూరు జట్లు విజయం సాధించాయి.

ఏసీఏ క్రికెట్ మైదానంలో

నగర్ రిమ్స్ సమీపంలో ఏసీఏ క్రికెట్ మైదానంలో చిత్తూరు, అనంతపురం జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో తొలుత టాస్ నెగ్గిన అనంతపురం జట్టు బ్యాటింగ్ చేపట్టి నిర్ణీత 35 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 126 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్ చేసిన చిత్తూరు జట్టు కేవలం 23.3 ఓవర్లలో 5 వికెట్లు మాత్రమే కోల్పోయి విజయానికి అవసరమైన 130 పరుగులు చేసింది. దీంతో చిత్తూరు జట్టు విజయం సాధించింది.

కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో

నగర శివారు ప్రాంతం కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో కడప, నెల్లూరు జట్ల మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో టాస్ నెగ్గిన నెల్లూరు జట్టు ఫీల్డింగ్ ఎంచుకోగా బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు నిర్ణీత 35 ఓవర్లలో 2 వికెట్లు మాత్రమే కోల్పోయి 209 పరుగులు చేసింది. ఇందులో యోగాంజనేయులు 52 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్ దిగిన నెల్లూరు జట్టు 34.1 ఓవర్లలో 1 వికెట్ నష్టానికి 210 పరుగులు చేసి విజయం సాధించింది. మౌనేష్ 96పరుగులు చేయగా, సోహాన్‌లతిక్ 58 పరుగులు చేశారు. దీంతో నెల్లూరు జట్టు 9 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

గెలుపోటములు సమానంగా స్వీకరించాలి

కడప మారుతీనగర్ జనవరి 12 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని నెహ్రూ యువకేంద్ర జిల్లా యువజన అధికారి మణికంఠ, మెప్మా పీడీ సురేశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను మున్సిపల్ క్రీడా మైదానంలో నిర్వహించారు. నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా అన్ని ప్రాంతాల నుంచి 20 టీమ్‌లు వాలీబాల్ పోటీలు కార్యక్రమంలో పాల్గొన్నారన్నారు. క్రీడల్లో ఉన్నత విజయం సాధించడం ద్వారా భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలకు మంచి మార్గం ఏర్పాటు అవుతుందని అన్నారు. టోర్నమెంటులో గెలుపొందిన వారికి నగదు బహుమతులు ట్రోఫీని అందించారు. మొదటి బహుమతి కడప డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ టీం నగదు బహుమతి రూ.7వేలు సర్టిఫకెట్లు ప్రధానం చేశారు. రెండో బహుమతి సిద్దవటం టీంకు రూ.3వేలు సర్టిఫికెట్లు అందించారు.

ఉత్సాహంగా సాగిన సంగీత నృత్యోత్సవాలు

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): నటరాజ కళా క్షేత్రం ఆధ్వర్యంలో రాయలసీమస్థాయి సంగీత నృత్యోత్సవాలు ఉత్సాహంగా సాగాయి. ఆదివారం సీమ సమా వివిధ ప్రాంతాల కళాకారులు ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. ప్రముఖులు మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు ఉన్నతమైనవని, నేటి యువత మన సంస్కృతి, సంప్రదాయాలను విస్మరించడం బాధాకరమన్నారు. పట్టణంలో మొదటిసారిగా ఉత్సవాలు నిర్వహించడం హర్షణీయమన్నారు. పలువురు నృత్యకారులకు రాయలసీమ నృత్యరత్న, రాయలసీమ సంగీతరత్న, విద్యార్థులకు రాయలసీమ మణిదీపిక అవార్డులను అందించారు. శ్రీచౌడేశ్వరీదేవి ఆర్ట్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంభం పాములేటికి రాయలసీమ సంగీత రత్న అవార్డును అందించారు.



అవార్డులను అందుకున్న దృశ్యం

ఆకేపాటి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

రాజంపేట టౌన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి సంబరాల్లో భాగంగా మండలంలోని ఆకేపాటి ఎస్టేట్‌లో ఆదివారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలు హరిత, హేమ, రెడ్డెమ్మకు ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్ రెడ్డి, సోదరుడు అనిల్‌కుమార్‌రెడ్డి బహుమతి ప్రదానం చేశారు. న్యాయనిర్ణేతలుగా మిరియాల సురేఖ, అన్నపూర్ణ వ్యవహరించారు.

17న తలనీలాల సేకరణ హక్కుల వేలం

లక్కిరెడ్డిపల్లె, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): అనంతపురం గంగమ్మ జాతర సందర్భంగా ఫిబ్రవరి 28 నుంచి మార్చి 3వ తేదీ వరకు, జాతర విడి దినాల్లో కొబ్బరి కాయలు, తలనీలాల సేకరణ, షామియానా ఏర్పాట్లు తదితరాల హక్కులకు ఈ నెల 17న వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి శ్రీనివాసులు తెలిపారు. ఔత్సాహికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రోడ్డు ఏర్పాటులో అత్యుత్సాహం

● సర్వే లేకుండానే పనులు ● కోర్టును ఆశ్రయించిన బాధితులు

రైల్వేకోడూరు, జనవరి 12(ఆంధ్రజ్యోతి): పొలాల్లోకి వెళ్లడానికి రైతులు తమ పొలంలోని కొంత భాగం ఇచ్చి ఏర్పాటు చేసుకున్న రహదారిలో ఆయా రైతుల అనుమతి లేకుండానే రోడ్డు వేసేందుకు అధికారులు అత్యుత్సాహం చూపుతున్నారని బత్తల ప్రసాద్ అనే వ్యక్తి హైకోర్టును ఆశ్రయించాడు. బాధితుడి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని శ్రీలక్ష్మీ ప్యారడైజ్ సినిమా హాలుకు ఎదురుగా ఉన్న దారికోసం ఒకప్పుడు ఆ ప్రాంతంలోని పొలాలకు వెళ్లేందుకు రైతులు తమ భూమిలో నుంచి కొంత వదులుకున్నారు. ఈ దారిలో రోడ్డు వేసేందుకు అధికారులు, కాంట్రాక్టరు పనులు ప్రారంభించారు. ఇందులో భాగంగా దారికి ఇరువైపులా పక్కనే ఉన్న స్థలాలను ఆక్రమించారు. ఈ స్థలాలను ఆయా రైతులు ప్రభుత్వాని రాసి ఇవ్వకపోయినా అధికారులు వారి అనుమతి లేకుండానే రోడ్డు వేసేందుకు చర్యలు తీసుకోవడంతో అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఈ నెల 4న జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. దీంతో ఆయన ఈ పనులకు సంబంధించిన విషయాలపై రైల్వేకోడూరు మండల ప్రజాపరిషత్ అధికారులతో ఆరా తీయగా, రోడ్డు ఏర్పాటు చేస్తున్న స్థలమంతా ప్రైవేటు భూమే అని


లక్ష్మీప్యారడైజ్ సినిమా హాలు ఎదురుగా ఉన్న దారిలో చేస్తున్న పనులు

చెప్పినట్లు తెలిసింది. దీంతో రోడ్డుకు హద్దులు ఏర్పాటు చేసి సర్వే రిపోర్టు పంపమని కోడూరు తహసీల్దార్, ఎంపీడీవోలకు జాయింట్ కలెక్టర్ లిఖితపూర్వకంగా ఆదేశాలు జారీ చేసినా, ఆయన ఆదేశాలను బేఖాతరు చేసి పనులను కొనసాగిస్తున్నారని బాధితుడు ఆందోళన వ్యక్తం చేశాడు. రోడ్డు నిర్మాణంలో తమ స్థలం పోతుందని బత్తల నరేష్ అనే వ్యక్తి కూడా హైకోర్టు ను ఆశ్రయించాడని తెలిపారు. రైతులకు న్యాయం చేయాల్సిన అధికారులు కాంట్రాక్టర్ కు న్యాయం చేస్తున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్లు తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఉత్తర్వులు అందితే పనులు నిలిపేస్తాం

హైకోర్టు ఉత్తర్వులు మాకు అందలేదు, అందితే పనులు నిలిపేస్తాం.. రోడ్డు పనులు సక్రమంగానే జరుగుతున్నాయి. భూ యజమానులు ముందుగా సర్వే చేయించుకుని ఉంటే ఈ సమస్య వచ్చేది కాదు. పనుల్లో ఎక్కడా అత్యుత్సాహం చూపడం లేదు. నిబంధనల ప్రకారమే పనులు చేస్తున్నాం

\- నాగార్జునరావు, ఎంపీడీవో, రైల్వేకోడూరు

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

రాయచోటి టౌన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): బాబాసాహెబ్ అంబేడ్కర్‌ను హేళన చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని కాంగ్రెస్ పార్టీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు గాజుల భాస్కర్ డిమాండ్ చేశారు. అంబేడ్కర్‌పై పార్లమెంటులో బీజేపీ ఎంపీల వ్యాఖ్యలకు నిరసనగా ఆదివారం స్థానిక మాసాపేటలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అమీన్, సల్మాన్, మన్సూర్‌అలీఖాన్, దర్బార్‌బాషా, చెన్నకృష్ణ, మంజునాథ,తదితరులు పాల్గొన్నారు.

ట్రెజరీ ఉద్యోగుల సంఘం కార్యవర్గం ఎన్నిక

రాయచోటిటౌన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆదివారం ఏపీ ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రవికుమార్ సమక్షంలో అన్నమయ్య జిల్లా కార్యవర్గం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఎస్. గోపాల్, అసోసియేట్ అధ్యక్షుడిగా వెంకటసుబ్బయ్య, ఉపాధ్యక్షుడుగా నగేశ్, చంద్ర, ఉమాబాయి, సెక్రటరీగా ఓర్సు సాయి కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా సాధక్‌బాషా, జాయింట్ సెక్రటరీగా శ్రీనివాసులు, చంద్రమోహన్‌బాబు, సుజిత, ట్రెజరర్‌గా ఉమాశంకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ

సుండుపల్లె, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో జరుపు కోవాలని మిలిటరీ కెప్టెన్, మాజీ ఎమ్మెల్యే మిన్నమరెడ్డి కృష్ణారెడ్డి సతీమణి పార్వతమ్మ తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో పంచాయతీ కార్మికులు, పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. మానవత చైర్మన్ గంగిరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు రెడ్డెయ్యరాజు తదితరులు పాల్గొన్నారు.



పాడి రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

● రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): పాడి రైతుల సంక్షేమానికి ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆదివారం రాయచోటి మండలం వరిగపాపిరెడ్డిగారి పల్లెలో నిర్మించిన పశువుల షెడ్లను మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో ఎక్కువ మంది రైతులు పాడి పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. రాయచోటి నియోజకవర్గానికి సుమారు 300 పశువుల షెడ్లు మంజూరయ్యాయన్నారు. ఈ షెడ్లు పశువులకు వాతావరణ మార్పుల నుంచి ఎంతగానో రక్షణ కల్పిస్తాయన్నారు. నియోజకవర్గానికి మంజూరైన పశువుల షెడ్లను అధికారులు త్వరితగతిన పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. అనంతరం ఆయన రాయచోటి మండల పరిధిలోని కాటిమాయకుంట గ్రామం గుంటిడుగులో నూతనంగా ఏర్పాటు చేసిన మూడు పశువుల షెడ్లను ప్రారంభించారు.

బండలాగుడు పోటీలు ప్రారంభం

పట్టణ పరిధిలోని ఎగువ అబ్బవరం హరిజనవాడ సమీపంలోని అర్చనా విద్యాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మన ఊరు- మన సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఎడ్ల బండలాగుడు పోటీలను మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. మొదటి బహుమతి రూ.50 వేలు, రెండవ బహుమతి రూ.40 వేలు, మూడో బహుమతి కింద రూ.30 వేలు, నాలుగో బహుమతి రూ.20 వేలు, ఐదో బహుమతి రూ.10 వేలు మంత్రి అందజేశారు. పోటీల్లో పాల్గొన్న ఎద్దుల పోషకులకు ప్రతి ఒక్కరికీ కన్సోలేషన్ బహుమతులు ఇచ్చారు. విద్యాసంస్థల కరస్పాండెంట్ డాక్టర్ పీ. మదన్‌మోహన్‌రెడ్డి ఉపాధ్యాయులు, విద్యార్థులు, రైతులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత పాటించాలి

చిన్నమండెం: రాయచోటి నియోజకవర్గంలో చేపడుతున్న సిమెంటు రోడ్ల నిర్మాణ పనులు నాణ్యతతో చేపట్టాలని, నాణ్యత లోపం ఉన్నట్లయితే సహించేది లేదని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి హెచ్చరించారు. ఆదివారం చిన్నమండెం


బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

మండలం తూర్పుపల్లి హరిజనవాడలో సీసీ రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాంట్రాక్టర్లు సిమెంటు రోడ్ల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. వండాడి గ్రామం ఎర్రగాట్లవాండ్ల పల్లెలో 2 గోశాలలు, 2 బోరు మోటారులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి సమస్య ఉన్న గ్రామాలను గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. వండాడి బాబురెడ్డి, మాజీ సర్పంచ్ వెంకట్రామిరెడ్డి, పీడీ వెంకటరత్నం, ఏపీడీ లక్ష్మినరసయ్య, ఈసీ సూర్యప్రకాశ్‌రెడ్డి, ఎఫ్ఏ వెంకట్రమణ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. బోరెడ్డిగారిపల్లెలోని తన నివాసంలో మంత్రి ప్రజా దర్బార్ నిర్వహించారు, జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితుల సమస్యలను స్వీకరించి వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

సంబేపల్లె: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాముడన్న క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. బీజేపీ అన్నమయ్య జిల్లా ఓబీసీ మోర్చా రేవన శివప్రసాద్, టీడీపీ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, శివప్రసాద్‌రెడ్డి, మట్లి శ్రీనివాసులునాయుడు, కార్యకర్తలు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపాకలో దళిత జానపదాల సంకీర్తన


దళిత జానపద కీర్తనలను ఆలపిస్తున్న కోటపాటి వెంకటేశ్వర్లు

రాజంపేట టౌన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి సందర్భంగా ఆదివారం తాళ్లపాక అన్నమాచార్య ధ్యాన మందిరంలో స్వర వాహిని చారిటబుల్ ఫౌండేషన్, రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ విజయవాడ వారి సహకారంతో దోపరికి గొబ్బిళ్లో.. యదుకుల స్వామికి గొబ్బిళ్లో అనే చారిత్రక కార్యక్రమం, జనజాతర నిర్వహించినట్లు కోటపాటి వెంకటేశ్వర్లు తెలిపారు. అన్నమయ్య సంకీర్తనలు, దళిత జానపద కళా రూపాలతో దళితుల జనజాతర అనే కార్యక్రమం నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు.

ధనుర్మాస భజనలు

రైల్వేకోడూరు, జనవరి 12(ఆంధ్రజ్యోతి): ధనుర్మాసం సందర్భంగా పట్టణంలో ఆదివారం రామ భక్తులు భజనలు చేశారు.. బలిజవీధిలోని కోదండ రామాలయంలో పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. రామసుబ్బారెడ్డి, మణి, ఎస్. మణి, వెంకటరెడ్డి, నరసింహులు, మనోహర్‌ఆచారి పాల్గొన్నారు.

'మానవత' సేవలను విస్తరించాలి

సుండుపల్లె, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మానవతా సేవలను మరింత విస్తరించాలని, ప్రజలకు చేరువ చేయాలని జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు యర్రపురెడ్డి జయమ్మ తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని మిన్నమరెడ్డి గంగిరెడ్డి స్వగృహంలో మానవత నెలవారీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలకు సేవ చేయాలన్న సంకల్పంతో ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి సంస్థలో భాగస్వాములు కావాలన్నారు. అనేక రకాల సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ 400 మంది సభ్యులను సంస్థలో చేర్పించడం సంతోషదాయకమన్నారు. వచ్చే ఏడాదికి మరింత మందిని భాగస్వాములు చేయాలన్నారు. ఈ సందర్భంగా మానవత చైర్మన్ గంగిరెడ్డి సంస్థకు రూ.10 వేలు ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మహబూబ్‌బాషా, చంగల్‌రాయుడు, హరికిరణ్, రెడ్డెయ్యరాజు, ప్రకాశ్‌నాయక్, ఆంజనేయులు, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

'గీతాంజలి క్రికెట్' విజేత చింతకాయలపల్లె

రాజంపేట, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): గత నెల రోజులుగా రాజంపేటలో నిర్వహిస్తున్న గీతాంజలి ప్రీమియర్ లీగ్ 3 విజేతగా చింతకాయలపల్లె జట్టు నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్ పోటీల్లో చింతకాయలపల్లె, వెంకటరాజుపేట మధ్య పోటీ పడ్డాయి. ఈ సందర్భంగా రాజంపేట డీఎస్పీ ఎన్.సుధాకర్, టీడీపీ కార్యదర్శి డాక్టర్ సుధాకర్ క్రీడాకారులను అభినందించారు. మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్, జిల్లా లీగల్‌సెల్ అధ్యక్షుడు టి.లక్ష్మీ నారాయణ కామెంటేటర్‌గా వ్యవహరించారు.విజేత జట్టుకు గీతాంజలి రమణ 50 వేల రూపాయలు. రన్నర్‌గా నిలిచిన వెంకటరాజుపేట జట్టు కు 30 వేల రూపాయలను సంబావు వినయ్ అందజేశారు. చెంగల్‌రాయులు స్పాన్సర్ చేసిన 30 వేల రూపాయలను 3వ స్థానంలో నిలిచిన భువనగిరిపల్లె జట్టుకు డీఎస్పీ సుధాకర్‌తో పాటు నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నేషనల్ వాలీబాల్ కోచ్ షామీర్‌బాషా, నాగినేని నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, నాయుడు, నామా హరి, రమణనాయుడు, గుగ్గిళ్ల చంద్రమౌళి, మాజీ పీపీ వెంకటసుబ్బయ్య, వెంకటస్వామి, చల్లా సుధాకర్, శ్రీను, గోపాల్, తోట రామయ్య, ఉద్దండం సుధాకర్, వదరయ్య తదితరులు పాల్గొన్నారు.

మంగంపేట సమస్యలపై టీడీపీ, బీజేపీ భేటీ

ఓబులవారిపల్లె, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : మంగంపేటలో కూటమి కార్యకర్తల సమస్యలపై టీడీపీ నాయకుడు అనుమలగుండం చంద్రమోహన్, బీజేపీ నాయకుడు పులపత్తూరి రామసుబ్బారెడ్డి చర్చించారు. నాయకుల్లో మార్పు రాకపోతే కార్యకర్తలకు తగు న్యాయం జరగకపోతే గడిచిన ఎన్నికల్లో వివిధ పార్టీలకు జరిగిన శాస్తి ఎవరికైనా తప్పదన్నారు. నిరన్వాసితుల సమస్యలు, ప్రజాధనం దుర్వినియోగం తీరు, ఇతర పార్టీల పాత్రను చర్చించామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి పార్టీల కార్యకర్తలు పాల్గొన్నారు.

స్వామి వివేకానందుడు యువతకు ఆదర్శం

రాయచోటి టౌన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి):స్వామి వివేకానంద భారతీయ యువతకు ఆదర్శం అని. ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (అపస్) జిల్లా అధ్యక్షుడు నరసింహులు అన్నారు. రాయచోటి డివిజన్ కార్యాలయంలో ఆదివారం స్వామి వివేకానందుని జయంతి సందర్భంగా నివాళులర్పించారు. స్వామి వివేకానందను యువత ఆదర్శంగా తీసుకోవాలి

రైల్వేకోడూరు: మండల బీజేపీ కార్యాలయంలో మండల బీజేపీ అధ్యక్షుడు సాయం శ్రీధర్ వివేకానందుడి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. తోట శ్రీనివాసులు, వాకచర్ల సుబ్బారావు, కాశప్పగారి రాము, మహేష్, రమేష్, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుల్లంపేట: పుల్లంపేటలో మండల బీజేపీ అధ్యక్షుడు కమలాపురం మనోహర్‌రెడ్డి. దళవాయిపల్లె ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడు రమణ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

రాజంపేట: వివేకానంద జన్మదినాన్ని పురస్కరించుకుని అన్నమాచార్య యూనివర్సిటీలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరం సీఎస్‌సీ విద్యార్థిని టి.చందన మొదటి బహుమతి, ఏఐఎంఎల్ థర్డియర్ విద్యార్థి కె.షఫీక్ అహ్మద్ ద్వితీయ, సీఎస్‌సీ విద్యార్థిని పి.కుషీదా తృతీయ బహుమతి గెలుచుకున్నారు.ప్రతిభ కనబరచిన విద్యార్థులను యూనివర్సిటీ ఛాన్సలర్ సి.గంగిరెడ్డి సర్టిఫికెట్లను అందజేశారు. వివేకానందుడి అడుగుజాడల్లో నడిచి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు.



బీజేపీ పట్టణ, గ్రామీణ అధ్యక్షుల ఎన్నిక ఏకగ్రీవం


రాజంపేట, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ పట్టణ అధ్యక్షుడుగా వేల్పుల రమణ, గ్రామీణ అధ్యక్షుడిగా గాడి ప్రసాద్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేష్‌నాయుడులు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కృష్ణయాదవ్, సురేష్‌రాజు, ఆదినారాయణ, సునీతనారాయణవర్మ, నరంద్రరాజు, శ్రీనివాస్, ధీరజ్, నాగేశ్వరరావు, మల్లికార్జునరాజు, రామయ్య, అరుణాచలం, వెంకటనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే చర్యలు

సిద్దవటం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగ సందర్భంగా కోడి పందేలు నిర్వహిస్తే చర్యలు తప్పవని ఇన్‌చార్జి ఏఎస్‌ఐ సుబ్బరామచంద్ర హెచ్చరించారు. ఆదివారం మండలంలోని రామస్వామిపల్లె, మాధవరం, జ్యోతి, నేకనాపురం గ్రామాల్లోని అనుమానిత ప్రదేశాల్లో తనిఖీలు నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగ పేరుతో కోడిపందేలు, పేకాట, అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించినా, ప్రోత్సహించినా కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ ఎల్.శివప్రసాద్‌రెడ్డి, స్థానిక పోలీసులు రామ్‌కుమార్, రాఘవేంద్ర, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

'అన్నమాచార్య'లో సంక్రాంతి క్రికెట్ పోటీలు

రాజంపేట, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : స్థానిక అన్నమాచార్య విశ్వవిద్యాలయ మైదానంలో రాజంపేట, నందలూరు మండలాలకు చెందిన విద్యార్థులకు క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యూనివర్సిటీ ప్రోచాన్సలర్ చొప్పా అభిషేక్ రెడ్డి, సి.అభినవ్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమం విజయవంతానికి కృషి చేసిన ఈవెంట్ మేనేజర్‌లు డాక్టర్ బి.నాగముని, డాక్టర్ కిషోర్‌కుమార్, ఎస్‌కే దినేష్, సైఫుల్లా సేవలను ప్రశంసించారు.





సంక్రాంతి వేడుకలేవీ...?

కనుమరుగవుతున్న గంగిరెద్దు ● జాడలేని గంగిరెద్దుల నృత్యాలు ● గొబ్బి ఆటలు ఆడేవారెవరు ? ● వినిపించని హరిదాసుల గొంతు





ఇంటి ముందు అలంకరించిన గొబ్బెమ్మ



గంగిరెద్దు ఆటలు (ఫైల్ ఫొటో)



బొమ్మల కొలువు

బద్వేలు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): నాడు సంక్రాంతి పండుగ వచ్చిందంటే గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొనేది. ఘనంగా వేడుకలను నిర్వహించుకునే వారు. కోడిపందేలు, ఎడ్ల పందాలు, రంగు రంగు ముగ్గుల్లో.. గొబ్బెమ్మలు, హరి దాసులు, గంగి రెద్దులు, కొత్త అల్లుళ్లతో సంక్రాంతి పండుగ కళకళలాడేది. పల్లెల్లో గాలి పటాల ఎగురవేత, ఇళ్లల్లో బాలికలు ఏర్పాటు చేసే బొమ్మల కొలువు, ఇంటి ముందు గంగి రెద్దుల నృత్యాలు ఇలా సంక్రాంతి పండుగ వేడుకగా జరిగేది. ఇదంతా ఒకప్పటి సంగతి. ఇప్పుడు సంక్రాంతి పండుగ మారిపోయింది. పండుగ రోజు తెల్లవారు జామున లేచి, తలంటి స్నానాలు చేసి, నూతన దుస్తులు ధరించి, మహిళలు పోటాపోటీగా రంగు రంగుల ముగ్గులువేసి ఇంటి పరిసరాలను ముచ్చటగా తయారు చేసుకునేవారు. నేడు అలాంటి దృశ్యాలు కనుమరుగవుతున్నాయి. పట్టణ వాసులు సైతం సంక్రాంతి పండుగ అనగానే పది రోజుల ముందే పల్లెకు చేరుకుని, అంతా కలసి పండుగ సంబరాల్లో మునిగే వారు. తెల్లవారు జామునే బాలసంతలు, పకీరుల వేషాలు వంటి దృశ్యాలు ఏనాడో కనుమరుగయ్యాయి. ఇంటి ముందుకు వచ్చి వంగి వంగి దండాలు పెట్టే గంగిరెద్దు నృత్యాల జాడలేకుండా పోయాయి. ఉదయాన్నే తలపాగా చుట్టుకుని ఇంటిముందు హరిదాసులు పాడే గీతాలు మచ్చుకైనా విన్పించడం లేదు. సంక్రాంతి పండుగ వచ్చిందంటే గ్రామాల్లో నెలరోజుల నుంచే సందడి వాతా వరణం నెలకొనేది. ఇప్పటి పరిస్థితుల్లో పాఠశాలలు, కళాశాలలు, బీటెక్ కళాశాలలు నామమాత్రంగానే సంక్రాంతి వేడుక చేస్తున్నారు. ప్రజలకు ఇప్పుడు సంక్రాంతి పండుగ భారంగా మారింది. నిత్యావసర సరుకుల ధరలు పెరిగిపోవడంతో ఏమీ కొనలేని పరిస్థితి ఏర్పడింది. పల్లెల్లో కరువు ఉండడంతో సంక్రాంతి పండుగను నామ మాత్రంగా చేసుకునే పరిస్థితి ఏర్పడింది.

రెడీమేడ్ వస్తువులపై ఆసక్తి

నాడు సంక్రాంతి పండుగ వస్తుందంటే 20రోజుల ముందే పల్లెల్లో ఇండ్లల్లో వి విధ రకాలు పిండివంటలు చేసేవారు. కర్జికాయలు, కారాలు, లడ్లు, అత్తరాసలు వంటివి స్వయంగా మహిళలు చేసుకునేవారు. అయితే రెడీమెడ్‌గా దొరుకుతుండడంతో పాత కాలపు వంటలకు స్వస్తిపలికి, రెడీమెడ్‌లో లభించే వస్తువులను కొనుగోలు చేసేందుకు ఆసక్తి కనపరుస్తుండడంతో నాటి వంటకాలు, వాటి రుచులకు దూరమవుతున్నారు.

జాడలేని గంగిరెద్దుల నృత్యాలు

సంక్రాంతి పండుగ వచ్చిందంటే పశువులను ఎంతో అందంగా అలంకరించే సంప్రదాయం. గంగిరెద్దులను ఎంతో అందంగా అలంకరించి, ఇండ్ల ఎదుట మేళం వాయిస్తే వాటికి అనుగుణంగా గంగిరెద్దులు నృత్యం చేసేవి. ఈ నృత్యం ఎంతో ఆనందకరంగా ఉండేది. అయ్యగారికి దండంపెట్టు అని చెప్పగానే గంగిరెద్దు కిందికి వంగి దండంపెట్టడం వంటివి సంక్రాంతికి ఎంతో సందడిచేసేవి. ఆ గంగిరెద్దు యజమానికి పాత వస్త్రాలు, ధాన్యము ఇచ్చేవారు. కాలానుగుణంగా ఈ గంగిరెద్దుల నృత్యాలు జాడలేకుండా పోతున్నాయి.

విన్పించని హరిదాసుల రాగం

సంక్రాంతి పండుగ రోజు గ్రామాల్లో హరిదాసుల హడావిడి ఉండేది. తలకు పాగా కట్టుకుని తంబురా చేతపట్టుకుని ఇంటి వద్దకు వచ్చి 'హరిలో రంగ హరి' అంటూ ఎంతో ముచ్చటగా రాగాలు తీసేవారు. నేడు హరిదాసుల రాగాలే విన్పించడంలేదు. రంగు రంగుల ముగ్గులువేసి, ముగ్గుల్లో గొబ్బెమ్మలను పెట్టి, బాలికలు గుమికూడి చక్క గా పాటలు పాడి ఆడుతూ సందడి చేసేవా రు. నేడు గొబ్బెమ్మలు, అలనాటి పాటలు, ఆటలు కొన్నిచోట్లే సాగుతున్నాయి.

నాటి ధాన్యపు రాశులు

తాతయ్యా ధాన్యపు రాసులు చూపించ వా.... నానమ్మా లేగదూడలు ఎక్కడ.... అమ్మమ్మా హరిదాసులేరి, గంగిరెద్దులేవీ. సంక్రాంతి పండుగకు వివిధ ప్రాంతాల నుంచి స్వగ్రామాలకు చేరుకున్న వారి పిల్లలు వేస్తున్న ప్రశ్నలు ఇవి. అయితే తాతయ్య, నానమ్మల గొంతు పెగలడం లేదు. వ్యవసాయంతో ముడిపడి సాగే సంక్రాంతిని ఈ సారి కరువు కమ్మేసింది. పల్లెల్లో పచ్చని పొలాలు బీళ్లుగా మారడంతో రైతన్నల ముం గిట ధాన్యపు రాశులు పెద్దగా కానరావడం లేదు. 40శాతం కూడా దాటని విస్తీర్ణంలో పెట్టిన పంటలు ఎలా కాపాడుకోవాలో అని రైతన్నలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది కన్నా, ఈ సారి వ్యాపారాలు తగ్గాయని, వ్యాపార వర్గాలు గగ్గోలు పెడుతున్నాయి.

సంక్రాంతి సంబరాలు చూసొద్దాం రండి

కామనూరులో అంగరంగ వైభవంగా సంక్రాంతి వేడుకలు ● ఆకట్టుకునేలా ఆటల పోటీలు ● ఆకర్షణీయమైన బహుమతులు

ప్రొద్దుటూరు రూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): పల్లె సీమకు వెలుగు నింపే పండుగ వచ్చింది. గ్రామాలు సుఖశాంతులతో, ధన ధాన్యాలతో శోభిల్లాలని వైభవంగా సంక్రాంతి ఉత్సవాలు జరిపేందుకు ఏర్పాట్ల కోలాహలం మొదలైంది. జిల్లాలోనే ఎక్కడా లేని విధంగా నాలుగు రోజులు సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటేలా కామనూరు గ్రామంలో నిర్వహించనున్నారు. ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి స్వగ్రామం కామనూరులో ఆయన సోదరుడు మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి, గ్రామ పెద్దలు, కామనూరు ప్రజల ఆధ్వర్యంలో సంబరాలను నిర్వహిస్తున్నారు. రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు, పార్వేట మహోత్సవం, లక్ష్మీప్రసన్న వేణుగోపాలస్వామి, భీమలింగేశ్వరస్వామి గ్రామోత్సవాలను తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది ప్రజలు తరలి రానున్నారు. సంక్రాంతి సంబరాలకు తలమానికంగా నిలిచిన కామనూరు ఉత్సవాలు వైభవంగా జరిగేందుకు దేవాలయాలు, వాటి పరిసర ప్రాంతాలు, వివిధ రకాలపోటీలు నిర్వహించే మైదానంలో విద్యుత్తు లైట్లతో అలంకరించారు. పెద్ద పెద్ద స్తంభాలకు అధిక విద్యుత్తు కాంతులను వెదజల్లే లైట్లను అమర్చి ఏర్పాట్లను తీర్చిదిద్దుతున్నారు. పోటీలకు అనుగుణంగా మైదానాన్ని చదును చేయడం, సభా వేదిక, చలువ పందిర్ల ఏర్పాట్లు, తదితర పనులను ముమ్మరంగా చేపట్టారు.

భోగి సందర్భంగా

సోమవారం ఉదయం 15 ఏళ్లలోపు జూనియర్ కబడ్డీ పోటీలను (టీమ్‌కు ఏడుగురు సభ్యులు) నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో మొదటి మూడు బహుమతులు ఇస్తారు. ఉదయం 10 గంటలకు ట్రాక్టర్ అండ్ ట్రాలీ రివర్స్ పందెం నిర్వహించనున్నారు. రెండు బహుమతులు ఇస్తారు. మధ్యాహ్నం రెండు గంటలకు స్లోబైక్ రైడ్ పోటీని నిర్వహిస్తారు. ఇందులో రెండు బహుమతులు ఇవ్వనున్నారు. రాత్రి 7 గంటలకు అరుణ ఆర్కెస్ట్రా వారిచే రేలా రే రేలా సంగీత విభావరి ఏర్పాటు చేశారు. సంక్రాంతి రోజున ఉదయం 8 గంటలకు 15 ఏళ్ల పైబడిన సీనియర్ కబడ్డీ పోటీలు (టీంకు ఏడుగురు సభ్యులు) పోటీలు జరుగనున్నాయి. పోటీల్లో రెండు బహుమతులు ప్రకటించారు. మధ్యాహ్నం భోజన ఏర్పాట్లను చేయనున్నారు. కనుమ రోజు ఉదయం 5 గంటలకు ప్రసన్న వేణుగోపాలస్వామి, భీమలింగేశ్వరస్వామి దేవాలయాల్లో వివిధ రకాల పూజా కార్యక్రమాలు చేపట్టనున్నారు. సాయంత్రం ఆరు గంటలకు పార్వేట మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. పార్వేట కామనూరు నుంచి ప్రారంభమై రాధానగర్, గోపులాపురం, ఎర్రబల్లె, పెద్ద అగ్రహారం, బుక్కాయపల్లె, చిన్న అగ్రహారం, మాచనపల్లె మీదుగా 16వ తేదీ ఉదయం 6 గంటలకు గ్రామంలోని ప్రసన్న వేణుగోపాలస్వామి దేవస్థానం చేరుతుందన్నారు. అదే రోజు ఉదయం 6 గంటలకు రాయచోటికి చెందిన రవితేజ చెక్కభజన బృందంచే చెక్కభజన చేపట్టనున్నారు.



మైదానంలో ఏర్పాటు చేసిన సభావేదిక

సుఖశాంతులతో శోభిల్లాలనీ....

ఇక్కడి స్వామివారి మూలవిరాట్టు నిర్మాణం చాలా విశేషమైంది. దశావతారాలు, గోపికలతో, పొన్నచెట్టు, గోవులతో, చతుర్భుజుడు శంఖుచక్రాలతో, వేణువుతో శ్రీకృష్ణ పరమాత్మ అత్యద్భుతంగా భక్తులకు దర్శనమిస్తూ ఉన్నారు. కామనూరులో నిర్వహించే గ్రామోత్సవం, పార్వేట మహోత్సవాలను తిలకించేందుకు వేలాదిగా భక్తులు, ప్రజలు, కళాకారులు రానున్నారు.

యుద్ధానికి సై...

16వ తేదీ ఉదయం 9 గంటలలకు సీనియర్ కేటగిరి విభాగంలో బండలాగుడు పందేలు నిర్వహించనున్నారు. ఇందులో మొదటి బహుమతిగా రాయల్‌ఇన్‌ఫీల్డ్ 350 సీసీ (బుల్లెట్) మొదటి బహుమతి, రెండో బహుమతిగా టీవీఎస్ అపాచి 160 సీసీ, మూడో బహుంతి టీవీఎస్ ఫోర్ట్ ద్విచక్ర వాహనం, 4వ బహుమతి టీవీఎస్ ఎక్స్‌ఎల్ 100, 5వ బహుమతిగా రూ.25 వేలు నగదు, 6వ బహుమతిగా రూ.15 వేలు విజేతలకు అందజేయనున్నట్లు తెలిపారు. మిగిలిన వారికి కన్సొలేషన్ బహుమతిగా రూ.5,116 అందించనున్నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయిలో నిర్వహించే ఈ ఎడ్ల పోటీలకు ఇప్పటికే సుమారు 18 నుంచి 20 జతల ఎద్దుల జతలు పోటీల్లో పాల్గొననున్నాయని తెలిపారు. ఎండ్ల పందేలకు పాల్గొనదలచినవారు పి.శివకాంత్‌రెడ్డి 6302087016, నంద్యాల శివనాగిరెడ్డి 6305785859, పెద్ది చంద్రశేఖర్ రెడ్డి 8309294918, నంద్యాల వరప్రసాద్‌రెడ్డి 9989357009ను సంప్రదించాలని, నేరుగానైనా వచ్చి పేర్లు నమోదు చేసుకుని పోటీల్లో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

ఇద్దరు న్యాయాధికారులకు పదోన్నతి

కలికిరి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలో పనిచేస్తున్న ఇద్దరు న్యాయాధికారులకు పదోన్నతి లభించింది. కడప న్యాయాధికారి, సీనియర్ డివిజన్ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి ఎస్. ప్రవీణ్‌కుమార్, ప్రొద్దుటూరు న్యాయాధికారి, సీనియర్ డివిజన్ సివిల్ జడ్జి కె. సత్యకుమార్‌కు సీనియర్ డివిజన్ జిల్లా జడ్జిలుగా పదోన్నతి కల్పించారు. ఏపీ హైకోర్టు, రిజిస్ట్రారు (విజిలెన్స్) చేసిన సిఫారసులను ప్రభుత్వం ఆమోదిస్తూ ఆదేశాలు జారీ చేసింది. జిల్లా జడ్జి పోస్టుల క్యాడర్ స్ట్రెంగ్త్‌ను 157 నుంచి 173 పెంచారు. 65 శాతం కోటా కింద రాష్ట్రంలో 9 మందికి పదోన్నతులు లభించగా అందులో కడప జిల్లా నుంచి ఇద్దరు న్యాయాధికారులు స్థానం పొందారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు.

గల్లంతైన విద్యార్థి మృతి

రాజుపాలెం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): గల్లైంతైన విద్యార్థి పందిటి యశ్వంత్ (7) మృతదేహం ఆదివారం లభ్యమైంది. పోలీసు ల వివరాల మేరకు... రాజుపాలెం మండలం పగిడాల వాసి యశ్వంత్ శనివారం బహిర్భూమికి వెళ్లాడు. విద్యార్థి చాపాడు కెనాల్ తాపల వద్ద ప్రమాదానికి గురై నీటిలో ము నిగిపోయాడు. కాల్వలో గల్లంతవడంతో బా లుడి ఆచూకీ కోసం కెనాల్‌ను జల్లెడ పట్టగా ఆదివారం మధ్యాహ్నం ఊరి శివారులో కంప చెట్లకు తగులుకుని ఉన్నాడని ఎస్‌ఐ కత్తి వెంకటరమణ తెలిపారు. బాలుడి శవాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

అవయవదానంతో అమరుడై...

కన్నుమూసినా జీవిస్తున్న గోపిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి

గుండె, కాలేయం, కిడ్నీలను దానం చేసిన కుటుంబీకులు



ప్రొద్దుటూరు రూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కన్ను మూసినా గుండె, కాలేయం, కిడ్నీలను దానం చేసి గోపిరెడ్డి రాజశేఖర్ రెడ్డి అమరుడయ్యాడు. కుటుంబసభ్యులు తీసుకున్న నిర్ణయం మరికొందరికి ప్రాణాలను నిలపింది. సమీప బంధువులు అందించిన వివరాల్లోకెళితే....

ప్రొద్దుటూరు మండలం గోపవరం వాసి గోపిరెడ్డి రాజశేఖర్ రెడ్డికి రాజుపాళెం మండలం గోపాయపల్లెకు చెందిన శ్రీదేవితో వివాహమైంది. వీరు సుమారు 20 ఏళ్ల కిందట హైదరాబాదులో సెటిల్ అయ్యారు. కుమారుడు పవన్‌కుమార్‌రెడ్డి సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా హైదరాబాదులో పనిచేస్తున్నారు. కుమార్తె ప్రసన్న అమెరికాలో ఉద్యోగం చేస్తోంది. వీరికి ఇంకా వివాహాలు కాలేదు. గోపిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి ఈనెల 1వ తేదీన రోడ్డు ప్రమాదానికి గురై తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో అపస్మారకస్థితిలోకి వెళ్లారు. శనివారం గోపిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. కుటుంబ సభ్యుల ఏకాభిప్రాయం మేరకు ఆయన అవయవాలను దానం చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఆస్పత్రిలో ఆయన గుండె, కాలేయం, రెండు కిడ్నీలను వేరు చేసి ఇతరులకు ప్రాణదానం చేశారు. ఆదివారం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించగా హైదరాబాదులోని సనత్‌నగర్‌లో ఉన్న జెడ్ కాలనీలో ఇంటికి తరలించారు. ఆదివారం మధ్యాహ్నం రాజశేఖర్‌రెడ్డి మృతదేహానికి అంత్యక్రియలను నిర్వహించినట్లు బంధువులు తెలిపారు.

గెలుపోటములు సమానంగా స్వీకరించాలి

కడప మారుతీనగర్ జనవరి 12 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని నెహ్రూ యువకేంద్ర జిల్లా యువజన అధికారి మణికంఠ, మెప్మా పీడీ సురేశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను మున్సిపల్ క్రీడా మైదానంలో నిర్వహించారు. నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా అన్ని ప్రాంతాల నుంచి 20 టీమ్‌లు వాలీబాల్ పోటీలు కార్యక్రమంలో పాల్గొన్నారన్నారు. క్రీడల్లో ఉన్నత విజయం సాధించడం ద్వారా భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలకు మంచి మార్గం ఏర్పాటు అవుతుందని అన్నారు. టోర్నమెంటులో గెలుపొందిన వారికి నగదు బహుమతులు ట్రోఫీని అందించారు. మొదటి బహుమతి కడప డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ టీం నగదు బహుమతి రూ.7వేలు సర్టిఫికెట్లు ప్రధానం చేశారు. రెండో బహుమతి సిద్దవటం టీంకు రూ.3వేలు సర్టిఫికెట్లు అందించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

ఒకరికి తీవ్రగాయాలు



మారుతీ శివకుమార్ ప్రకాశ్

మదనపల్లె అర్బన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొనడంతో ప్రకాశ్ (55), మారుతీ శివకుమార్ (61) మృతి చెందగా ఆనంద్ గాయపడ్డాడు. కర్ణాటక రాష్ట్రం రాయల్పాడు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంపై పోలీసులు తెలిపిన వివరాల మేరకు... తిరుపతి కట్టకిందపాలెంకు చెందిన ప్రకాశ్ తిరుపతి టౌన్ బ్యాంక్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. తన స్నేహితుడు ఆనంద్‌తో కలిసి శనివారం బెంగళూరు వెళ్లారు. పని ముగించుకుని తిరిగి వస్తుండగా రాయల్పాడు వద్ద కడప నుంచి మారుతీ శివకుమార్ వెళుతున్న కారును ఆదివారం రాత్రి 9 గంటలకు ఢీకొంది. ప్రకాశ్ సంఘటనా స్థలంలోనే మృతి చెందగా తీవ్రంగా గాయపడిన ఆనంద్‌ను చెన్నైకి తరలించారు. కడప వాసి మారుతీ శివ కుమార్‌ను మదనపల్లె ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. రాయల్పాడు పోలీసులు కేసు నమోదు చేశారు.

నెల్లూరు, చిత్తూరు జట్ల విజయం

కడప స్పోర్ట్స్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ సౌత్‌జోన్ అండర్ 12 బాలుర ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ మ్యాచ్‌లో భాగంగా ఆదివారం జరిగిన రెండు వేర్వేరు మ్యాచ్‌లలో చిత్తూరు, నెల్లూరు జట్లు విజయం సాధించాయి.

ఏసీఏ క్రికెట్ మైదానంలో

నగర్ రిమ్స్ సమీపంలో ఏసీఏ క్రికెట్ మైదానంలో చిత్తూరు, అనంతపురం జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో తొలుత టాస్ నెగ్గిన అనంతపురం జట్టు బ్యాటింగ్ చేపట్టి నిర్ణీత 35 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 126 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్ చేసిన చిత్తూరు జట్టు కేవలం 23.3 ఓవర్లలో 5 వికెట్లు మాత్రమే కోల్పోయి విజయానికి అవసరమైన 130 పరుగులు చేసింది. దీంతో చిత్తూరు జట్టు విజయం సాధించింది.

కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో

నగర శివారు ప్రాంతం కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో కడప, నెల్లూరు జట్ల మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో టాస్ నెగ్గిన నెల్లూరు జట్టు ఫీల్డింగ్ ఎంచుకోగా బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు నిర్ణీత 35 ఓవర్లలో 2 వికెట్లు మాత్రమే కోల్పోయి 209 పరుగులు చేసింది. ఇందులో యోగాంజనేయులు 52 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్ దిగిన నెల్లూరు జట్టు 34.1 ఓవర్లలో 1 వికెట్ నష్టానికి 210 పరుగులు చేసి విజయం సాధించింది. మౌనేష్ 96పరుగులు చేయగా, సోహన్‌లతిక్ 58 పరుగులు చేశారు. దీంతో నెల్లూరు జట్టు 9 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

ఉత్సాహంగా సాగిన సంగీత నృత్యోత్సవాలు

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): నటరాజ కళా క్షేత్రం ఆధ్వర్యంలో రాయలసీమస్థాయి సంగీత నృత్యోత్సవాలు ఉత్సాహంగా సాగాయి. ఆదివారం సీమ నమా వివిధ ప్రాంతాల కళాకారులు ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. ప్రముఖులు మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు ఉన్నతమైనవని, నేటి యువత మన సంస్కృతి, సంప్రదాయాలను విస్మరించడం బాధాకరమన్నారు. పట్టణంలో మొదటిసారిగా ఉత్సవాలు నిర్వహించడం హర్షణీయమన్నారు. పలువురు నృత్యకారులకు రాయలసీమ నృత్యరత్న, రాయలసీమ సంగీతరత్న, విద్యార్థులకు రాయలసీమ మణిదీపిక అవార్డులను అందించారు. శ్రీచౌడేశ్వరీదేవి ఆర్ట్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంభం పాములేటికి రాయలసీమ సంగీత రత్న అవార్డును అందించారు.



అవార్డులను అందుకున్న దృశ్యం

ఆగని ఇసుక, మట్టి తవ్వకాలు



వాల్మీకిపురం మండలం కూరపర్తి గ్రామం వద్ద ఇసుక అక్రమ తవ్వకాలు చేస్తున్న దృశ్యం



నిమ్మనపల్లెలో టిప్పర్లతో అక్రమంగా మట్టిని తరలిస్తున్న దృశ్యం

వాల్మీకిపురం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): ఇసుక, మట్టి అక్రమ రవాణాను అడ్డుకోవాలని అధికారులు ఎంత హెచ్చరిస్తున్నా వాటికి అడ్డుకట్ట వేయలేకపోతుండటం గమనార్హం. స్థానిక అవసరాలకు మినహా బయటి ప్రాంతాలకు ఇసుక అక్రమ రవాణా చేయకూడదన్న నిబంధనలను ఏమాత్రం లెక్కచేయకపోవడం శోచనీయం. వాల్మీకిపురం మండల వ్యాప్తంగా ఇసుక అక్రమ రవాణా, రహస్య డంపింగ్‌లకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. మండలంలోని బాహుదా కాలువ ప్రాంతంలో ఇసుకాసురుల అక్రమాలకు అధికారులు ఏమాత్రం కళ్లెం వేయలేకపోతున్నారన్న విమర్శలు చోటుచేసుకుంటున్నాయి. ఓ వైపు అధికారుల నిఘా ఉన్నప్పటికీ ఇసుక మాఫియా అక్రమాలను ఏమాత్రం నిలువరించలేకపోతున్నారన్న విమర్శలు చోటుచేసుకుంటున్నాయి. మండలంలోని కూరపర్తి గ్రామ కుంట పొరంబోకు స్థలాలు, బాహుదా కాలువ ప్రాంతాలను ఏకంగా జేసీబీ యంత్రాలతో ఇసుకను డంపింగ్ చేస్తూ అక్రమ రవాణాలకు పాల్పడుతున్నారు. దీనిపై ప్రశ్నించిన గ్రామస్థులను బెదిరింపులకు గురి చేయడంతో మిన్నకుండిపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు ఇసుక మాఫియా ఆగడాలను అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నిమ్మనపల్లెలో యథేచ్ఛగా మట్టి అక్రమ రవాణా

నిమ్మనపల్లి, జనవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలో యథేచ్ఛగా మట్టిని తరలించి కొందరు పబ్బంగడుపుకుంటున్నారు. ఆదివారం నిమ్మనపల్లి పంచాయతి బాహుదా కాలువ పక్కన ఉన్న అగ్రహారం పంచాయతి నుంచి మట్టిని తవ్వి టిప్పర్ల సాయంతో మదనపల్లికి చెందిన వైసీపీ కౌన్సిలర్ శివారెడ్డి తరలిస్తున్నాడు. మట్టి తరలించాలంటే సంబంధిత తహసీల్దార్ వద్ద అనుమతులు కచ్చితంగా తీసుకోవాల్సి ఉంటుంది. కాగా టిప్పర్ల సాయంతో దాదాపు 100లోడ్లకు పైగా మట్టిని తరలించి భూమి చదును చేసుకొని ప్లాట్లు వేసేందుకు సిద్ధం చేస్తున్నాడు. దీనిపై కౌన్సిలర్ మాట్లాడుతూ తమకు అన్నీ అనుమతులు ఉన్నాయని సంబంధిత రెవెన్యూ అధికారులతో పాటు పోలీసులతో కూడా తమకు ఇబ్బంది లేదని తెలిపారు. దీనిపై తహసీల్దార్ దనంజేయులును 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా మట్టి తరలింపునకు ఎలాంటి అనుమలు లేవని తెలిపారు. ఎవరైనా సరే అక్రమంగా మట్టిని తరలిస్తే అలాంటి వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

పోలీసుల అదుపులో ఇసుక ట్రాక్టర్లు



వాల్మీకిపురం పోలీసుల అదుపులో ఉన్న ఇసుక ట్రాక్టర్లు

వాల్మీకిపురం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం మండల పరిసరాల్లో అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్న ఓ ఎక్స్‌కవేటర్‌తో పాటు రవాణాకు పాల్పడిన ఐదు ఇసుక ట్రాక్టర్లను స్థానిక పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గత కొద్ది రోజులుగా పరిసర ప్రాంతాలలో బాహుదా కాలువలో ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా జరుగుతుండటం గమనార్హం. దీనిపై పోలీసులు నిఘా పెట్టి ముమ్మర తనిఖీలు నిర్వహించడం ఈనేపథ్యంలోనే ఆదివారం ఐదు ఇసుక ట్రాక్టర్లు ఓ ఎక్స్‌కవేటర్‌ను పట్టుకున్నారు. అయితే వాహనాలు పట్టుకున్న సమయం నుంచి పోలీసు అధికారులకు రాజకీయ ఒత్తిళ్లు వచ్చినట్లు తెలిసింది.

కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

ములకలచెరువు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగ సందర్భంగా కోడిపందేలు, జూదాలు నిర్వహించినా...ఆడినా కఠిన చర్యలు తీసుకుంటామని ములకలచెరువు సీఐ లక్ష్మన్న హెచ్చరించారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ప్రత్యేక బృందాలతో నిఘా ఉంచామన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చర్యలు తప్పవన్నారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణానికి భంగం కల్గిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. సర్కిల్ పరిధిలోని ములకలచెరువు, పెద్దతిప్పసముద్రం, తంబళ్లపల్లె, పెద్దమండ్యం మండలాల్లో ఎక్కడైనా కోడిపందేలు, జూదాలు జరిగితే తమ దృష్టికి తేవాలన్నారు.

మదనపల్లె అర్బన్‌లో: మదనపల్లె మండలంలో కోడిపందేలు, జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని తాలుకా సీఐ కళావెంకటరమణ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సంక్రాంతి పండుగను పుష్కరించుకుని ఎక్కడైనా కోడిపందేలు, జూదాలు నిర్వహిస్తుంటే తమ దృష్టికి తీసుకురావాలని సీఐ కోరారు. అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించరాదని ఆయన హెచ్చరించారు.

పెద్దతిప్పసముద్రంలో: మండలంలో సంక్రాంతి పండుగను పురష్కరించుకుని గ్రామాల్లో ఎటువంటి కోడిపందేలు, పేకాట వంటి ఆసాంఘిక కార్యక్రమాలను కొనసాగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రవికుమార్ హెచ్చరించారు. మండలంలో ఎక్కడైనా కోడిపందేలు, జూదాలు ఇతర ఆసాంఘిక కార్యక్రమాలను చేపడుతుంటే వెంటనే డయల్ 100కు గానీ, 112కు గానీ సమాచారం ఇవ్వ వచ్చని లేదా పెద్దతిప్పసముద్రం సబ్ ఇన్‌స్పెక్టర్ 9440900716 నంబర్‌కు సమాచారాన్ని పంపించ వచ్చని ఎస్ తెలిపారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

కత్తితో పొడిచిన నిందితుడు రిమాండ్‌కు తరలింపు

మదనపల్లె అర్బన్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఈశ్వమ్మ కాలనీకి చెందిన కేశవులు కుమారుడు నారాయణపై కత్తితో గాయపర్చిన మదనపల్లె పట్టణం బుగ్గకాలువకు చెందిన పూలగంటి జగదీష్(45) అనే యువకుడిపై ఆదివారం రిమాండ్‌కు తరలించినట్లు తాలుకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. జనవరి 1వ తేదీన ఈశ్వరమ్మకాలనీలో నారాయణపై ఐదువందలు ఇవ్వలేదని కత్తితో దాడి చేసిన సంఘటన తెలిసిందే. కాగా నారాయణ ఫిర్యాదు మేరకు తాలుకా సీఐ కేసు నమోదు చేసి జగదీష్ వద్ద కత్తి స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

క్రీడాకారునికి పదివేలు ఆర్థిక సాయం

మదనపల్లె అర్బన్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): క్రీడాకారులను ప్రోత్సహిస్తూ ఇంటర్నేషన్ షూటింగ్‌బాల్‌కు ఎంపికైన క్రీడాకారుడు షేక్ యూసఫ్‌కు మదనపల్లె పట్టణానికి చెందిన టీడీపీ నాయకుడు బిల్లే రెడ్డిప్రసాద్ స్థానిక ఎమ్మెల్యే షాజహాన్‌బాషా చేతులమీదుగా పదివేల రూపాయాల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తంబళ్లపల్లె నియోజకవర్గానికి చెందిన క్రీడాకారుడు ఆర్థిక పరిస్థితి లేనికారణంగా ఇబ్బందులు పడకుండా ఉండాలనే సాయం చేసినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ మంచి మనస్సుతో క్రీడాకారులను ఆదుకుని వారికి ప్రోత్సాహం అందివ్వాలని కోరారు.

ధర్మపథంలో నేడు పౌర్ణమి వేడుకలు

వాల్మీకిపురం, జనవరి 12: వాల్మీకిపురం పట్టణ పడమర పొలిమేరల్లోని ధర్మపథం ఆలయంలో సోమవారం షిరిడీసాయి సాలిగ్రామ తిరునారాయణ ధార్మిక సేవా ట్రస్టు ఆధ్వర్యంలో పౌర్ణమి వేడుకలు నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు శ్రీనివాసాచార్యులు పేర్కొన్నారు. ఉదయం ఆలయంలో అభిషేకం, ప్రత్యేక పూజలు, సాయంత్రం ఆలయంలో సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం, అభయాంజనేయస్వామికి ఆకుపూజ, సింధూర పూజ, టమాలాసేవ, వడమాల సమర్పణ అనంతరం పౌర్ణమి వేడుకలు, సత్యనారాయణ స్వామి వ్రతం జరుగుతాయన్నారు.

గురువుల రుణం తీర్చుకోలేనిది



కలకడ, జనవరి 12(ఆంధ్రజ్యోతి): విద్యాబుద్ధులు నేర్పిన గురువుల రుణం తీర్చుకోలేనిదని పూర్వ విద్యార్థులు అన్నారు. ఆదివారం జరిగిన పూర్వ విద్యార్థుల కలయికకు మండలంలోని పాపిరెడ్డిగారిపల్లె జడ్పీ హైస్కూల్ వేదికైంది. 1997-98 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన 48 మంది 27 ఏళ్ల తరువాత ఓ చోట చేరారు. ఈ సందర్భంగా వివిధ వృత్తుల్లో స్థిరపడ్డ వారందరూ యోగక్షేమాలను తెలుసుకున్నారు. విద్యా దశలో చేసిన అల్లరి చేష్టలను గుర్తుచేసుకొని మురిసిపోయారు. నాటి ఉపాధ్యాయులు రెడ్డెప్పనాయుడు, రెడ్డెప్పరెడ్డి, నాగభూషణంలను ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. తమ వంతు సాయంగా పాఠశాలకు రూ.50 వేలు విలువైన వాటర్ కూలింగ్ యూనిట్‌ను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శివకుమార్, పూర్వ విద్యార్థులు వెంకటరెడ్డి, రెడ్డెప్ప, పొత్తూరి శ్రీకాంత్, రమేష్, వెంకటేశ్వరరావు, మధు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్ర క్రికెట్ జట్టుకు మదనపల్లె క్రీడాకారులు



హితేష్



తేజేష్



షేక్ అక్తర్

మదనపల్లె టౌన్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర క్రికెట్ అకాడమి తరపున అండర్-14 జట్టుకు మదనపల్లెకు చెందిన ముగ్గురు క్రీడాకారులు ఎంపికైనట్లు కేఎస్ఎస్‌బీ క్లబ్ కార్యదర్శి ఖాదర్‌బాబా, కోచ్ జనార్ధన్ తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ ఈనెల 11, 12 తేదీల్లో విశాఖపట్నంలో అండర్-14 క్రికెట్ జట్టుకు ఎంపిక నిర్వహించగా మదన పల్లెకు చెందిన పి.హితేష్, ఎస్ఎండీ షేక్ అక్తర్, జి.తేజేష్‌లు రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారన్నారు. వారు ఆంధ్ర జట్టు తరపున జనవరి 27వ తేదీన పాండిచ్చేరిలో నిర్వహించే సౌత్ ఇండియా అండర్-14 టోర్నమెంట్‌లో పాల్గొం టారన్నారు. మదనపల్లె నుంచి ముగ్గురు రాష్ట్ర జట్టుకు ఎంపికైనందుకు సీనియర్ క్రీడాకారు లు శివప్రసాద్, నరేంద్రరాయల్ అభినందిం చారు.

సీనియర్ సిటిజన్స్ సంక్షేమమే ధ్యేయం

మదనపల్లె అర్బన్, జనవరి 12(ఆంధ్రజ్యోతి):సీనియర్ సిటిజన్స్ సంక్షేమమే లక్ష్యమని వక్తలు పేర్కొన్నారు. ఆదివా రం స్థానిక జీఆర్టీ ఉన్నత పాఠశాల్లో సభ్యులతో సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునిగోపాలకృష్ణ మాట్లాడుతూ వయోవృద్ధుల ఆస్తులను పిల్లలకు రాసిఇచ్చినా కూడా వారి తల్లిదం డ్రులను సక్రమంగా చూడకపోతే ఆ ఆస్తులను తిరిగి తల్లిదండ్రులకే చెందు తుందని సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. ఐసీఐసీ బ్యాంకు ద్వారా యాదగిరి ఆఫ్రిడ్ కుమారి హేమ, రిలేషన్ షిప్ మేనేజర్లు సీనియర్ సిటిజన్స్‌కు 88మందికి పదవీ వరమణ చేసిన పెన్షర్స్‌కు లైఫ్ సర్టిఫికుట్స్‌ను అందజేశారు. ముందస్తు సంక్రాంతి సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించి గెలుపొం దిన వారికి బహుమతులు అందజేశారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమం లో సభ్యులు వీఎం నాగరాజ, ఉస్మాన్, డాక్టర్ మునిరత్నం, జడన్‌మోహన్, కృష్ణమూర్తి, ఆంధ్ర పెన్షర్ పార్టీ నాయకులు శ్రీనివాసులు, తిమ్మయ్య, ధనలక్ష్మీ, మనోరమ, డాక్టర్ గొల్లపూడి తిరుపతిరావు, రామచంద్ర య్య, ప్రొఫెసర్ శ్రీనివాసులు, ఎన్ఆర్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి జేతవనంలో సంక్రాంతి సంబరాలు

కలికిరి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కలికిరి సమీపంలోని కొటాల గ్రామం వద్ద వున్న అంతర్జాతీయ పిరమిడ్ ఆధ్వర్యంలోని జేతవనంలో సోమవారం నుంచి సంక్రాంతి సంబరాలు ప్రారంభం కానున్నాయి. మూడు రోజులు వరుసగా ఈ అనేక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో శాకాహారం, ధ్యానం, మహా ధ్యానం, మహా సత్సంగం వంటి విషయాలపై అవగాహన కోసం ఆదివారం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు.

రెడ్డెమ్మకు ప్రత్యేక పూజలు

గుర్రంకొండ, జనవరి 12(ఆంధ్రజ్యోతి):గుర్రంకొండ మండలం చెర్లోపల్లె రెడ్డెమ్మకొండ ఆలయంలో ఆదివారం అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. అమ్మవారు సంతానలక్ష్మిగా ప్రసిద్ధి చెందారు. ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను చేశారు. అమ్మవారిని దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చారు. అమ్మవారి కృపతో సంతానం పొందిన మహిళలు మొక్కులు తీర్చుకోవడానికి రావడంతో పరిసరాలు రద్దీగా మారాయి. భక్తులు కొబ్బరి కాయలను సమర్పించి తీర్థప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో ఈవో మంజుల, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్వామి వివేకానంద యువతకు ఆదర్శం



మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

మదనపల్లె అర్బన్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): స్వామీ వివేకానంద యువతకు ఆదర్శమని స్థానిక ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. స్వామి వివేకానంద జయంతిని ఎమ్మెల్యే ఆధ్వర్యంలో మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా స్వామీ వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆస్పత్రిలోని రోగులకు, సిబ్బందికి పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామీ వివేకానంద. సమాజ శ్రేయస్సు కోసం పాటుపడ్డారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు షంషీర్, శివన్న, బిల్లేరెడ్డిప్రసాద్, నియోజకవర్గ బీసీసెల్ అధ్యక్షుడు ఎం. నాగయ్య, 30వార్డు ఇన్‌చార్జి దుబ్బిగాళ్ల భాస్కర్, డాన్స్ రెడ్డెన్న, మల్లికార్జున నాయుడు, గుత్తికొండ త్యాగరాజ, కోన భాస్కర, వాల్మీకి సంఘం నాయకులు పలిశ్రీనివాసులు, జయ, ఆదెన్న, తదితరులు పాల్గొన్నారు. పట్టణంలో పలుచోట్ల స్వామీ వివేకానంద జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బీజే పీ నాయకులు సొసైటీ కాలనీలోని వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అలాగే హెల్పింగ్‌మైండ్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు అబుబాకర్ సిద్ధిక్ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా ఆస్పత్రిలోని స్వామీ వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్థానిక జడ్పీ హైస్కూల్‌లోని వివేకానంద విగ్రహానికి యూటీఎఫ్ జిల్లా, డివిజన్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు సుధాకర్ నాయుడు, చిత్తూరు జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్‌నాయుడు, జిల్లా కార్యదర్శి పురం వెంకటరమణ, నాయకులు, బీజేపీ నాయకులు బండిఆనంద్, జబ్బల శ్రీనివాసులు, ఎల్లంపల్లె ప్రశాంత్, బర్నేపల్లె రవికుమార్, జేకే వర్మ, బాలాజీ, వరదారెడ్డినారథరెడ్డి, విజయభారతి సేతు, ఏబీసీ భాస్కరాచారి, రిటైర్డ్ టీచర్ రెడ్డెప్ప, ఎమ్మార్పీస్ నరేంద్ర, వివేకానంద ఆశయ ఫౌండేషన్ భాను, హెల్పింగ్ మైండ్స్ సభ్యులు పాల్గొన్నారు.

పీలేరులో: స్వామి వివేకానంద 162వ జయంతిని ఆదివారం పీలేరులోని పలు సంఘాలు ఘనంగా నిర్వహించాయి. స్థానిక కోటపల్లె క్రాస్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు అర్పించి ఘనంగా నివాళులర్పించాయి. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే జీవీ శ్రీనాథరెడ్డి మాట్లాడుతూ స్వామి వివేకానంద కోరుకున్నట్లు యువత దేశ నిర్మాణంలో భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు. స్థానిక వాసవీ క్లబ్ గ్రేటర్, వాసవీ కపుల్స్ క్లబ్ సభ్యులు సంయుక్తంగా స్వామి వివేకానందకు ఘనంగా నివాళులు అర్పించారు. ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు అర్పించారు. కార్యక్రమాల్లో ఎంపీటీసీ కంభం నరసింహారెడ్డి, టీడీపీ బీసీ సెల్ నాయకులు పోలిశెట్టి సురేంద్ర, వీ211ఏ వాసవీ క్లబ్ సభ్యులు జూటూరు అరవింద్, పామిడి జయచంద్ర, తులసీకృష్ణ, సకల హరి, కేసర్ల భరత్, అమరా సత్యనారాయణ, శివఫణేష్, గోవర్ధన ప్రసాద్, అనిల్ కుమార్, శంకర్‌నాథ్, విజయ మహేశ్, నవీన్, ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం సభ్యులు దివాకర్, గోవర్ధన్ ప్రసాద్, శివశంకర్, రమణయ్య, శంకర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



స్వామి వివేకానందకు నివాళులు అర్పిస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

వాల్మీకిపురంలో: స్వామి వివేకానంద జయంతి వేడుకలను ఆదివారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవికుమార్, జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ప్రభుచరణ్, డాక్టర్ సోని, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పీలేరు రచయితలకు ఘనసన్మానం



సన్మానం అందుకుంటున్న జలకనూరి మురళీధర రాజు

పీలేరు, జనవరి 12(ఆంధ్రజ్యోతి): చిత్తూరులో జరిగిన సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా పీలేరుకు చెందిన పలువురు రచయితలు, కవులకు ఆదివారం ఘనసన్మానం లభించింది. చిత్తూరు జిల్లా రచయితల సంఘం, ఎంవీ కేశవ రెడ్డి మెమోరియల్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం చిత్తూరులోని నాగయ్య కళాక్షేత్రంలో సంక్రాంతి సంబరాలు-2025 పేరిట సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పీలేరుకు చెందిన ప్రముఖ కవి, రచయిత, తెలుగు భాషా సమితి వ్యవస్థాపకులు జలకనూరి మురళీధర రాజు, యువ రచయిత వినాయకం ప్రకాశ్, బడబాగ్ని శంకర్ రాజు, విశ్రాంత తహసీల్దారు వెంకటశేషయ్యలను ఘనంగా సన్మానించారు. చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, మాజీ రాష్ట్రపతులు సర్వేపల్లె రాధాకృష్ణన్, వీవీ గిరి మనవళ్లు సుబ్రహ్మణ్యం శర్మ, కేశవ రెడ్డి స్మారక ఫౌండషన్ వ్యవస్థాపకులు ఎంవీ శ్రీధర్ రెడ్డి, చిత్తూరు జిల్లా రచయితల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గిరిధర్, సహదేవనాయుడు జ్ఞాపిక, ప్రశంసా పత్రాలు అందించారు.

రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వం లక్ష్యం

● గోకులం షెడ్డు ప్రారంభోత్సవంలో టీడీపీ నేత జయచంద్రారెడ్డి



గోపిదిన్నెలో గోకులం షెడ్డును ప్రారంభిస్తున్న టీడీపీ నేత దాసరిపల్లె జయచంద్రారెడ్డి

తంబళ్లపల్లె, జనవరి 12(ఆంధ్రజ్యోతి): పాడిరైతుల సంక్షేమమం, అభివృద్ధే కూటమి ప్రభుత్వం లక్ష్యమని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత దాసరిపల్లె జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని గోపిదిన్నెలో గోకులం షెడ్డను టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రాగానే రైతుల సంక్షేమం కోసం రాయితీ కింద గోకులం షెడ్లను మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, సిద్దమ్మ, రాజంపేట పార్లమెంటు తెలుగు యువత ఉపాధ్యక్షుడు దేరంగుల చంద్ర, రాష్ట్ర బీసీ ఉపాధ్యక్షుడు తులసీధర్‌నాయుడు, ఉత్తమ్‌రెడ్డి, చెరువు నీటి సంఘం అధ్యక్షుడు శివకుమార్, ఉపాధ్యక్షుడు ఆదిరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి నాయుడు, వీరాంజినేయులు, సోముశేఖర్, వార్డు సభ్యుడు జగదీష్, భాస్కర్, క్లస్టర్ ఇంచార్జి బేరి శీన, తెలుగు యువత నరసింహులు, మ్యూజికల్ శివ, మణి, మదన్‌మోహన్‌రెడ్డి, కాలానారాయణ, ఆనంద్‌నాయుడు, జయరాంరెడ్డి, శివకుమార్, శ్రీనివాసులు, గంగాధర్, బాలాజీ నాయుడు పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రంలో: జాతీయ ఉపాధిహామీ పథకంలో భాగంగా మండలంలోని వివిధ గ్రామాల్లో మొదటి విడతగా ప్రభుత్వం 50 గోకులం షెడ్లను మంజూరు చేసింది. ఇందులో భాగంగా ఆదివారం స్థానిక పీటీఎంకు చెందిన హారున్ రషీద్ తమ పాడి ఆవుల కోసం నిర్మిం చిన పశువుల షెడ్‌ను తంబళ్లపల్లె నియోజకవర్గం టీడీపీ నాయకుడు దాసరిపల్లె జయచంద్రారెడ్డి కూటమి నాయకులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో కూట మి నాయకులు అదిక సంఖ్యలో పాల్గొన్నారు.

పెద్దమండ్యంలో: కూటమి ప్రభుత్వం పాడి ఆవులకు 90 శాతం సబ్సిడీతో మంజూరు చేసి నిర్మించిన గోకులం షెడ్లు పాడి రైతులకు వరమని టీడీపీ పరిశీలకుడు సీడ్ మల్లికార్జుననాయుడు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని పాపేపల్లెలో గోకులం షెడ్డును ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా టీడీపీ మాజీ ఉపాధ్యక్షుడు విశ్వనాథరెడ్డి, మాజీ మండలాధ్యక్షుడు సిద్దవరం ప్రసాద్, కూటమి నాయకులు నారాయణ, శంకర్‌రెడ్డి, మహేంద్ర, వెంకట్రమణ, చంద్రారెడ్డి, గంగాధర్, యుగంధర్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, మహేశ్వర, కాలేషా, ఏపీవో మురళి పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో: మండలంలో ఉపాధి హామీ పథకం కింద బయ్యప్పగారిపల్లె, శీలంవారిపల్లెల్లో నిర్మించిన గోకులం షెడ్లను టీడీపీ నేత దాసరిపల్లె జయచంద్రారెడ్డి ఆదివారం ప్రారంభించారు. గోకులం షెడ్లను రైతులు సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శంకరయ్య, ఏపీడీ మధుబాబు, ఏపీవో మంజుల, టీఏ నారాయణ, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

సంక్రాంతి రైతుల జీవితాలలో వెలుగులు నింపాలి



వాల్మీకిపురంలో గోకులం ప్రారంభ వేడుకలలో టీడీపీ నాయకులు

వాల్మీకిపురం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగతో రైతుల జీవితాలలో వెలుగులు నింపాలని రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్ వల్లిగట్ల రమణ, వాల్మీకిపురం టీడీపీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డిలు పేర్కొన్నారు. ఆదివారం వాల్మీకిపురంలో రైతు హరి వ్యవసాయ పొలాల వద్ద నిర్మించుకున్న గోకులం షెడ్డు ప్రారంభ వేడుకలు, సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. ఈసందర్భంగా పశువులను అలంకరించి పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు పీవీ నారాయణ, చంద్రమౌళి, కోసూరి రమేష్, మురళి, టమోటా రామచంద్ర, కేకేనాయుడు, రామాంజులురెడ్డి, రాజేంద్రాచారి, ఏపీవో సూరి పాల్గొన్నారు.

అసమానత్వానికి మూలమైన కులాన్ని నిర్మూలించాలి

● బాస్ వ్యవస్థాపకుడు పీటీఎం శివప్రసాద్



కుల నిర్మూలనా చైతన్య సభలో ఐక్యతను చాటుతున్న బాస్ నాయకులు

మదనపల్లె అర్బన్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): సమాజంలో కుల, వర్ణ, లింగ అసమానత్వానికి మూల కారణమైన కుల వ్యవస్థను నిర్మూలించాలని బాస్ వ్యవస్థాకుడు పీటీఎం శివప్రసాద్ పిలుపునిచ్చారు. భారతీయ అంబేడ్కర్ సేన 13వ వార్సికోత్సవ సందర్భంగా నిర్వహించిన కుల నిర్మూలన చైతన్య సభలో ఆయన మాట్లాడుతూ కుల నిర్మూలన జరగనదే ఆర్థిక సామ్యవాదం రాదని , సామాజిక, కుల, రాజకీయ ఉద్యమాలు గుర్తించి ఐక్యంగా పోరాటాలకు సన్నద్ధం కావాలన్నారు. చతుర్వర్ణ వ్యవస్థకు ప్రతీకగా ఉన్న బొమ్మను దహనం చేశారు. అంతకముందు మదనపల్లెలో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో జానపద అకాడమీ కర్ణాటక గొల్లహల్ల శివప్రసాద్, బహుజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రజాకవి పోతబోలు రెడ్డెప్ప, ప్రముఖ పారిశ్రామికవేత్త శ్రీనివాసులు, బాస్ రాష్ట్ర కన్వీనర్ గణపతి, కార్యదర్శి తాతయ్య, రమణ, జిల్లా కన్వీనర్ ముత్యాల మోహన్, మైనార్టీ నేత ఫీర్‌బాషా, కృష్ణ, రవికిరణ్, పాల్గొన్నారు.

మదనపల్లె బోధనాస్పత్రి ప్రైవేటీకరణను ఆపివేయాలి



నిరసన తెలియజేస్తున్న బీఎస్పీ , సీపీఎం నేతలు

మదనపల్లె అర్బన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి):మదనపల్లె పట్టణంలోని బోధనాస్పత్రి ప్రైవేటీకరణను వెంటనే ఆపివేయాలని బీఎస్పీ, సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఆమేరకు ఆదివారంస్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందెల గౌతమ్ కుమార్, సీపీఎం సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు నాయకులతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వైద్యశాఖ మంత్రి సత్యకుమార్‌కు మదనపల్లెకు వైద్య కళాశాల లేకుండా చేసి, ఉన్న జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిని ప్రైవేట్‌పరం చేస్తూ మదనపల్లె ప్రజల నోట్లో మట్టి కొడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో బీఎస్పీ సీపీఎం నాయకులతోపాటు నవజీవన వెల్ఫేర్ సొసైటీ కార్యదర్శి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

మదనపల్లెలో సంక్రాంతి ముగ్గుల పోటీలు



సమావేశంలో మాట్లాడుతున్న ఆలయకమిటీ సభ్యులు

మదనపల్లె అర్బన్, జనవరి 12(ఆంధ్రజ్యోతి):మదనపల్లెలో సంక్రాంతి పండుగ సందర్భంగా ఈనెల 14న ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో కమిటీ సభ్యులు విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ మకరజ్యోతి నాడు ఆలయంలో ఉదయం గణపతి హో మం, అష్టాభిషేకం, స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. స్వామి తిరుఆభరణాలు పెట్టెలతో పట్టణంలోని పురవీదులో చెక్కభజనలు, కోలా టాల నడుమ ఊరేగింపు జరుగుతుందన్నారు. ఆలయంలో సాయంత్రం 6.30 గంటలకు మకరజ్యోతి దర్శనం కల్పిస్తామన్నారు. సంక్రాంతి ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందిస్తామని, అలా గే తిరుపతి అన్నమాచార్య ప్రాజెక్టు వారిచే అన్నమాచార్య సంకీర్తనలు జరుగుతాయన్నారు. మదనపల్లె పట్టణం, నక్కలదిన్నెకు చెందిన బండార్ల వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఉదయం నుంచి రాత్రి వరకు అన్నదానం వితరణ చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఉత్సవకమిటీ సభ్యులు మార్పూరి సుధాకర్‌నాయుడు, జర్మనీ రాజు, రమనరావు, బాలుస్వా మి, విజయలక్ష్మీభాస్కర్, పోస్టాపీస్ రమణ, కేశవ, రవి, హేమంత్, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా సునీల్‌రెడ్డి



నిమ్మనపల్లి, జనవరి 12(ఆంధ్రజ్యోతి): బీజేపీ మండల అధ్యక్షునిగా రెడ్డివారి సునీల్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అన్నమయ్య జిల్లా బీజేపీ కార్యదర్శి ప్రశాంత్, నంద్యాల ఇన్‌చార్జి రమేష్‌నాయుడు తెలిపారు. ఆదివారం మండలంలోని స్థానిక పార్టీ కార్యాలయంలో స్వామి వివేకానంద 162వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సంధర్భంగా జరిగిన సమావేశంలో మండలంలో బీజేపీని మరింత ముందకు తీసుకెళ్లేందకు సునీల్‌రెడ్డి కృషి చేస్తాడన్నారు. అనంతరం సునీల్‌రెడ్డి మాట్లాడుతూ తనకు అధ్యక్షపదవి ఇచ్చినందకు కృత్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో శేఖరయ్య, శ్రీరాములు, సోమశేఖర్, శంకర్‌రెడ్డి, మదనమోహన్, బాలకిష్ట తదితరలు పాల్గొన్నారు.